


వైసీపీ నిత్యం కూటమి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తోంది. అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి లేకుండా రాష్ట్రాన్ని సర్వనాశనం చేసింది. ఇప్పుడున్న 14 నెలల్లో అభివృద్ధి చూసి ఓర్చుకోలేక ఫేక్ ప్రచారాలు చేస్తోంది. ప్రకాశం బ్యారేజ్ గేట్లపై తప్పుడు ప్రచారం అర్థరహితం.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**



గురువారం 21.08.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 129 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


**స్టార్టప్ లకు ఊపిరి పోసేలా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్**

**అమరావతితో పాటు ఐదు చోట్ల ఆర్టీఐహెచ్ కేంద్రాలు**


**రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభించిన సీఎం చంద్రబాబు**

**ఆర్టీఐహెచ్ ప్రారంభంలోనే ఇన్నోవేషన్ బిజినెస్ స్టార్టప్ లకు రికార్డు స్థాయి రిజిస్ట్రేషన్లు**

**24 గంటల్లో రికార్డు స్థాయిలో 1,67,321 రిజిస్ట్రేషన్లకు గిన్నిస్ వరల్డ్ రికార్డు**



# ఆవిష్కరణల కేంద్రంగా ఆంధ్రా



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణలకు కేంద్రంగా మారుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, స్టార్టప్ లకు ఊతమిచ్చేలా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ పనిచేస్తుందని స్పష్టం చేశారు. అమరావతితో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఐదు చోట్ల ఇన్నోవేషన్ కేంద్రాలను హబ్ అండ్ స్పోక్ మోడల్ లో ఏర్పాటు చేసినట్టు వివరించారు. బుధవారం మంగళగిరిలోని మయూరి టెక్ పార్కులో ఏర్పాటు చేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ను టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్ తో కలిసి ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "రతన్ టాటా ఆలోచనలను సజీవంగా ఉంచాలని ఇన్నోవేషన్ హబ్ ప్రారంభిస్తున్నాం. రతన్ టాటా నిరాడంబరత, దేశానికి చేసిన సేవ అందరికీ ఆదర్శం. అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ను ప్రారంభించటం ఓ చారిత్రాత్మక సమయం. గివ్ బ్యాక్ టు ది సొసైటీ అనే విధానాన్ని రతన్ టాటా అవలంభించారు. రతన్ టాటా ఆలోచనల్ని భవిష్యత్ తరానికి అందించాలన్న లక్ష్యంతోనే ఇన్నోవేషన్ హబ్ లను ప్రారంభించాం. విజయవాడ, విశాఖ, తిరుపతి, అనంతపురంలోనూ దీనికి అనుబంధంగా కేంద్రాలు పనిచేస్తాయి. ఏపీలోని 175 నియోజకవర్గాల్లో ఇన్నోవేషన్ కేంద్రాలు ఉండాలని నిర్ణయించాం. యువతకు ఉన్న వినూత్న ఆలోచనల్ని క్రోడీకరించి ప్రోత్సహించేలా ఈ ఇన్నోవేషన్ హబ్ పని చేస్తుంది. యువపారిశ్రామిక వేత్తలు అవకాశాలను వాడుకోండి. టెక్నాలజీ వల్ల ఉద్యోగాలు పోతాయన్న అంశాన్ని నేను విశ్వసించను. ఏపీ పారిశ్రామికవేత్తలు గ్లోబల్ కమ్యూనిటికీ సేవలందించేలా ఎదగాలని కోరుకుంటున్నా. అగ్రిటెక్ లో ఇన్నోవేషన్ కు విస్తృతమైన అవకాశాలు ఉన్నాయి. వ్యవసాయం, విద్య, వైద్యం, రక్షణ, ఇలా అనేక రంగాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయి." అని సీఎం వివరించారు.

**ఇంటికో పారిశ్రామిక వేత్త :** "ప్రతి కుటుంబం నుంచి ఓ పారిశ్రామిక వేత్త రావాలనేదే నా నినాదం. ఈ లక్ష్యంతో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ లు పనిచేస్తాయి. సరైన ప్రభుత్వ విధానాలు అవలంభిస్తే ఆదాయం, సంపద వస్తుంది. భవిష్యత్ అంతా ఐటీ రంగానిదేనని నాడు గుర్తించాను. దేశంలో ఎవరూ చేయనంతగా ఇంజినీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేశాం. సంపద సృష్టి జరగాలంటే ఆర్థిక వృద్ధి అవసరం. గత 10 ఏళ్లలో 11వ ఆర్థిక వ్యవస్థ నుంచి నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించాం. త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతున్నాం. అప్పుడు సంపద మరింతగా పెరుగుతుంది.

మిగతా 2లో...

## నరేగా బిల్లులకు మోక్షం

- 2014-19 మధ్య పనులు జరిగిన బిల్లుల విడుదలకు రంగం సిద్ధం
- చెల్లింపుల కోసం కేంద్రంతో మాట్లాడి 3,54,177 పనులు ఆన్ గోయింగ్ వర్కులుగా మార్పు
- రూ.180 కోట్ల చెల్లింపులకు కసరత్తు పూర్తి
- సిఎం ఆదేశంతో పనులు చేసిన వారి అకౌంట్లలోకి 23వ తేదీన జమ కానున్న రూ.145 కోట్లు

వివరాలు 2లో...

వచ్చే ఏడాదికి

## 10 లక్షల ఇళ్ల నిర్మాణం

**నెల రోజుల్లో 3 లక్షల కుటుంబాలకు గృహప్రవేశాలు**

**ఇళ్లులేని పేదలను గుర్తించేందుకు 15 రోజుల్లో సర్వే**

**గృహ నిర్మాణ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి**

**ఏడాది కాలంలో రూ.2,013 కోట్లు ఖర్చుపెట్టిన ప్రభుత్వం**

వివరాలు 3లో...

## అమరావతిలో హుడ్కో ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్..



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** రాజధాని అమరావతిఅభివృద్ధి దిశలో మరో ప్రతిష్టాత్మక నిర్మాణ ప్రాజెక్టు త్వరలో ప్రారంభం కానుంది. హుడ్కో ఆధ్వర్యంలో 10 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించబోయే హుడ్కో ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ రాష్ట్ర గర్వకారణంగా నిలుస్తుందని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమసాని చంద్రశేఖర్ ఢిల్లీ నుంచి విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. హుడ్కో బోర్డు ఇప్పటికే 10 ఎకరాలను భూసేకరణకు ఆమోదించగా, వాటిలో 8 ఎకరాలకు ఏపీ సీఆర్డీఏ ప్రాథమిక అనుమతులు ఇచ్చింది. మిగిలిన 2 ఎకరాల భూసేకరణ ప్రక్రియ కూడా వేగంగా పూర్తవుతోందని ఆయన వివరించారు. ఢిల్లీలోని ఇండియా హాబిటాట్ సెంటర్ స్థాయిలో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకోనుందని, హుడ్కో కార్యాలయాలతో పాటు హౌసింగ్ మరియు అర్బన్ డెవలప్‌మెంట్ రంగాలకు అవసరమైన శిక్షణా సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. ఈ కాంప్లెక్స్‌లో ఆధునిక ఆడిటోరియం,

మిగతా 2లో...

## ఇన్నోవేషన్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా ఏపీ



**మంగళగిరి, (జర్నలిస్ట్ ఫైల్):** ఆవిష్కరణలకు వనరులు అడ్డంకి కాదు, వినూత్నమైన ఆలోచనలే ముఖ్యం. ప్రతి యువకుడు విద్యార్థి దశ నుంచే మెరుపులాంటి ఆలోచనలతో ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ కోరారు. మంగళగిరి సమీపంలో ఎన్ హెచ్ –16 పక్కన కొత్తగా నిర్మించిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభోత్సవంలో మంత్రి లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... ఇన్నొవేషన్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా ఎపిని తీర్చిదిద్దేందుకు దిగ్గజ పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలతో కలసి పనిచేసేందుకు మేం సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఈరోజు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభోత్సవంలో మీ ముందు నిలబడటం నాకు ఎంతో గర్వంగా ఉంది. ఇది కేవలం ఒక భవనం మాత్రమే కాదు – రాష్ట్రంలోని లక్షలాది యువతకు ఆశాకిరణం, విశ్వాస ప్రకటన, ఆంధ్రప్రదేశ్ ఏదైనా సాధించగలదనే వాగ్దానం. ఈ హబ్ భరతమాత ముద్దుబిడ్డ రతన్ టాటా జీ

మిగతా 2లో...

స్త్రీ శక్తి పథకం..

## సూపర్ సక్సెస్



**విజయవాడ, (జర్నలిస్ట్ ఫైల్):** స్త్రీ శక్తి పథకం రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా అమలవుతుండటంపై రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారు ఆర్టీసీ హౌస్ లో ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో మీడియాతో మాట్లాడారు. "స్త్రీ శక్తి పథకం ఎప్పుడొస్తుందా అని మీడియా, ప్రతిపక్షాలు ఎదురు చూశాయి. ఇప్పుడు సినిమా సక్సెస్ మీట్ లాగా, స్త్రీ శక్తి సక్సెస్ మీట్ నిర్వహించడం నాకు ఎంతో ఆనందంగా ఉంది" అని ఆయన అన్నారు. మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో అమలవుతున్న సూపర్ సిక్స్ పథకాలలో ఒకదాన్ని మించి ఒకటి ప్రజల ఆదరణ పొందుతున్నాయని తెలిపారు. వాటిలో ఎక్కువ మంది లబ్ధిదారులు ఉన్న పథకం స్త్రీ శక్తి అని, దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది మహిళలు లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు.

**ఎలాంటి సమస్యలు లేకుండా అమలు :** స్త్రీ శక్తి పథకం ప్రారంభించి ఆరవ రోజుకే సుమారు 65 లక్షల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం

మిగతా 2లో...

## కర్నూలు జిల్లాలో విషాదం.. ఆరుగురు చిన్నారుల మృతి



**ఆస్పరి(జర్నలిస్ట్ ఫైల్):** కర్నూలు జిల్లాలో విషాద ఘటన చోటు చేసుకుంది. నీటి కుంటలో ఈతకు దిగి ఆరుగురు చిన్నారులు మృతి చెందారు. ఆస్పరి మండలం చిగలి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న ఏడుగురు విద్యార్థులు గ్రామ శివారులోని కొండ ప్రాంతంలో ఉన్న కుంటలో ఈత కొట్టేందుకు వెళ్లారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కుంటలో భారీగా నీరు చేరింది.

మిగతా 2లో...

## అర్హులకే పింఛన్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** బోగస్ సదరం సర్టిఫికెట్లతో దివ్యాంగుల పింఛన్లను పొందే అనర్హులను ఏరివేసేందుకే సదరం సర్టిఫికెట్ల పున:పరిశీలన కార్యక్రమం జరుగుచున్నదని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్థసారధి స్పష్టం చేశారు. గతంలో ఉన్న అర్హతలను బట్టే సర్టిఫికెట్ల పున:పరిశీలన జరుగుచున్నదని,

మిగతా 2లో...

## వైసీపీకి ఇంకా బుద్ధి రాలేదు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** వైసీపీ అధికారం కోల్పోయి 11 సీట్లకు పరిమితమైనా ఇంకా బుద్ధి రాలేదని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో బుధవారం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ కూటమి ప్రభుత్వంపై నిత్యం బురదజల్లే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రాన్ని ఐదేళ్లపాటు పాలించిన వైసీపీ ఒక్క అభివృద్ధి కార్యక్రమం చేపట్టలేదని, ఆర్థికంగా 30 ఏళ్ల వెనుకబాటుకు నెట్టిందని ఆరోపించారు. ఇక కూటమి ప్రభుత్వం కేవలం 14 నెలల్లోనే సాధించిన అభివృద్ధి వైసీపీ నేతలకు జీర్ణించకపోవడంతో ఫేక్ ప్రచారాలకు దిగుతున్నారని విమర్శించారు. ప్రకాశం బ్యారేజీ గేట్లు దెబ్బతిన్నాయని, నీరు పోతలేదని వైసీపీ వ్యాప్తి చేస్తున్న వార్తలు అబద్ధమని స్పష్టం చేశారు. 70 గేట్లలో 69 ఎత్తి సముద్రంలో నీరు వృథా అవుతుంటే, ఆ నీటిని వినియోగించుకునేందుకు చంద్రబాబు బనకచర్ల ప్రాజెక్టు ప్రతిపాదించారని తెలిపారు. వైసీపీ వరదలపై కూడా ఫేక్ ప్రచారాలు చేస్తోందని, చిన్నపాటి వానకే అమరావతి మునిగిపోయిందంటూ అబద్ధాలు చెబుతోందని ఆయన విమర్శించారు. వరదల నియంత్రణకు, బుడమేరు వాగుపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని వివరించారు. అమరావతిని "భ్రమరావతి", "కమ్మ రాజధాని" అంటూ అబద్ధపు ప్రచారం చేసినవారు ఇప్పుడు పెట్టుబడులపై కూడా అడ్డంకులు సృష్టిస్తున్నారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధరలు కల్పిస్తోందని, పోలవరం పనులు వేగంగా సాగుతున్నాయని, రాయలసీమలో హంద్రీ–నీవా లైనింగ్ పనులు పూర్తిచేసి చివరి ఆయకట్టు వరకు కృష్ణాజలాలు చేరుతున్నాయని గుర్తుచేశారు. జీవీఎస్ఎస్ ప్రాజెక్టుకు వెయ్యి కోట్ల రూపాయలు కేటాయించామని, స్టీల్ ఫ్యాక్టరీ పనులు కూడా జిందాల్ సహకారంతో ప్రారంభమైనట్లు తెలిపారు. ప్రజలు వైసీపీ పాలనలో ఎదుర్కొన్న చేదు అనుభవాల కారణంగా టీడీపీ వైపు ఆకర్షితులవుతున్నారని, రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ ఖాళీ అవుతోందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం చంద్రబాబు 20 ఏళ్లపాటు అధికారంలో ఉంటే రాష్ట్రం ఎంతో ముందుకు పోతుందన్న నమ్మకంతో ప్రజలు టీడీపీకి పట్టం కట్టారని రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు.

## ముఖ్యమంత్రి, ఆరోగ్య శాఖ మంత్రికి ప్రభుత్వ వైద్యుల సంఘం కృతజ్ఞతలు

- **బోధనా వైద్యులకు వన్‌టైమ్ ప్రమోషన్లలో 98 శాతం విజయవంతం**



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలోని ప్రభుత్వ బోధనా వైద్యులకు వన్ టైమ్ ప్రమోషన్స్ కల్పించడంలో ముఖ్యమంత్రి, ఆరోగ్య శాఖ మంత్రి చూపించిన చొరవపై ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఆనందం వ్యక్తం చేసింది. 98 శాతం సక్సెస్ రేట్‌తో ఒకే సారి ప్రమోషన్స్ అమలు కావడం చారిత్రాత్మకమని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డి.జయధీర్ పేర్కొన్నారు ప్రమోషన్లు ఎవ్వరూ స్వీకరించడం లేదనే తప్పుడు వక్రీకరణతో వైద్య ,ఆరోగ్య శాఖ మంత్రికి కూడా తెలియకుండా ప్రొఫెసర్,అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతి ద్వారా భర్తీ చేసేందుకు ప్రయత్నించగా, దీనిపై సంఘం తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేసి ఆరోగ్యశాఖ మంత్రి వర్యులు సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకు వెళ్లడం జరిగింది. .మంత్రి వర్యులు సత్యకుమార్ యాదవ్ జోక్యం చేసుకోవడంతో ఆ నోటిఫికేషన్ నిలిపివేయబడి, వన్ టైమ్ ప్రమోషన్ దిశగా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నందుకు ముఖ్యమంత్రి, ఆరోగ్య శాఖ మంత్రికి సంఘం కృతజ్ఞతలు తెలిపింది. చాలాకాలంగా కలగన్న ప్రమోషన్లు డీపీసీ ద్వారా 1:4 నిష్పత్తిలో జరిగి, ఖాళీ ఉన్న అన్ని పోస్టులు మంత్రి వర్యులు గౌరవ సత్యకుమార్ యాదవ్ జోక్యంతో భర్తీ చేయడం గొప్ప ముందడుగని ప్రభుత్వ వైద్యుల సంఘంఅభిప్రాయపడ్డింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ తరఫున రాష్ట్రాధ్యక్షుడు డా. జయధీర్, ప్రధాన కార్యదర్శి డా. రమేష్, కోశాధికారి డా. పీ.జె. శ్రీనివాస్‌లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్గారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు.

**పదవీ విరమణ వయస్సు 65 ఏళ్లకు పెంపు ప్రతిపాదన తీవ్ర నష్టదాయకం :** ప్రమోషన్లు ఎవ్వరూ స్వీకరించడం లేదనే తప్పుడు వక్రీకరణతో ప్రొఫెసర్,అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతి ద్వారా భర్తీ చేసేందుకు ప్రయత్నించినట్లుగానే , ప్రొఫెసర్ల కొరత ఉందంటూ మరోసారి ప్రభుత్వాన్ని తప్పుద్రోవ పట్టిస్తూ ప్రభుత్వ బోధనా వైద్యుల పదవీ విరమణ వయస్సును 65 ఏళ్లకు పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇది కూడా అర్థరహితమైన ప్రతిపాదనగా ప్రభుత్వ వైద్యుల సంఘం అభిప్రాయపడింది. దాదాపుగా అన్ని ప్రొఫెసర్ పోస్టులు నిండుగా ఉన్న సమయంలో పదవీ విరమణ వయస్సును పెంచితే, అత్యధిక శాతం మంది వైద్యులు పదోన్నతులు కోల్పోయే పరిస్థితి వస్తుందని, అంతే కాకుండా ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతుందని పేర్కొన్నారు. 65 ఏళ్ళకు పదవీ విరమణ వయసు పెంపును ఇప్పటికే ఆర్థిక శాఖ రెండుసార్లు వ్యతిరేకించిందని, అయినప్పటికీ కొందరు ఉన్నతాధికారులు ప్రతిపాదనలు పంపిస్తునే ఉంటున్నారని తెలిపారు. ఈ ఆమోదయోగ్యం కాని, ప్రభుత్వంపై ఆర్థిక భారం పెంచే పదవి విరమణ వయసు పెంపు ప్రతిపాదనపై వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టి సారించి కూలంకుషంగా పరిశీలించి వైద్యులు పదోన్నతులు నష్టపోకుండా నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వ వైద్యుల సంఘం నేతలు కోరారు. ఈ నిర్ణయం వైద్యుల ఉత్సాహాన్ని పెంచుతుందని, భవిష్యత్‌లో ఆరోగ్యరంగ అభివృద్ధికి దోహదం చేస్తుందని సంఘం పేర్కొంది.

## ఇన్నోవేషన్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా ఏపీ




(మొదటి పేజీ తరువాయి)

అత్యున్నత నైతిక విలువలు, మహోన్నత వ్యక్తిత్వ స్ఫూర్తితో నెలకొల్పబడింది. నేడు ఈ హబ్‌ను దివంగత రతన్ టాటాజీ ఆదర్శాలకు అంకితం చేస్తున్నాం. రాజకీయ నాయకుడిగానే మీకంతా తెలిసిన చంద్రబాబు ఒక విజయవంతమైన పారిశ్రామికవేత్త. అయితే హెరిటేజ్ ప్రారంభానికి ముందు ఆయన మూడు కంపెనీలు పెట్టి విఫలమయ్యారు. ఆ తర్వాత చిత్తూరు జిల్లాలో రైతులకు సాయం చేయాలన్న సంకల్పంతో హెరిటేజ్ ప్రారంభించారు. ఆ సంస్థ ఈరోజు 12 రాష్ట్రాలకు విస్తరించి రూ. 5వేల కోట్ల వ్యాపారం చేస్తోంది. వైఫల్యాలతో ఆయన తన ప్రయాణాన్ని ఆపలేదు. ఏదైనా సాధించాలంటే పట్టుదల, నిబద్ధత, ఓర్పు ఉండాలి. అప్పుడే మనం అద్భుతమైన ఫలితాలను సాధించగలం.

ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ ను ప్రపంచపటంలో నిలిపిన చంద్రబాబునాయుడు ఆ చరిత్రలో ఆంధ్రప్రదేశ్ లో పునరావృతం చేయాలని నేను కోరుకుంటున్నాను. ప్రతి కుటుంబానికి ఒక పారిశ్రామికవేత్త ఉండాలన్నది చంద్రబాబు గారి లక్ష్యం. అమరావతిని హైదరాబాద్ స్థాయిలో అభివృద్ధి చేయాలన్న పట్టుదలతో చంద్రబాబునాయుడు అవిశ్రాంతంగా శ్రమిస్తున్నారు. బాబు గారి నేతృత్వంలో రెండోసారి మంత్రిగా పనిచేస్తున్నాను. ఆయనతో కలిసి పనిచేయడం చాలా కష్టం. ఉదయం 10గంటలకు టాస్క్ ఇచ్చి, కేవలం 15 నిమిషాల వ్యవధిలో ఆ పని ఎక్కడవం-కు పూర్తయిందని అడుగుతారు. ఆంధ్రప్రదేశ్ లో గత 14 నెలల కూటమి పాలనలో స్నేహపూర్వక పారిశ్రామిక విధానాలను అమలు చేస్తూ పెద్దఎత్తున పెట్టుబడులను ఆకర్షించగలిగాం. గత అయిదేళ్లపాలన తాలూకు అవలక్షణాలను తొలగించి అభివృద్ధి పథంలో ప్రత్యేక గుర్తింపు తేగలిగాం. ఎపి పెట్టుబడుల టాస్క్ ఫోర్స్ కమిటీ చైర్మన్ గా అంగీకరించి, మమ్మల్ని ముందుకు నడిపిస్తున్న టాటా గ్రూప్ చైర్మన్ **చంద్రశేఖరన్‌కి ప్రత్యేక ధన్యవాదాలు**.

రతన్ టాటాజీ కన్నుమూసినపుడు మేం క్యాబినెట్ మీటింగ్ లో ఉన్నాం. వెంటనే ముంబాయి వెళ్లి ఆయనకు నివాళులర్పించి తిరిగి వచ్చేటప్పుడు దేశానికి ఎంతో సేవలందించిన ఆ మహనీయుని పేరిట ఏదో ఒకటి చేయాలని భావించాం. ఆయన ఆశయాలు, ఆలోచనలను ముందుకు తీసుకెళ్లాలన్న ఉద్దేశంతో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేశాం. దీనిద్వారా పారిశ్రామికవేత్తలకు పూర్తిస్థాయి మద్దతు ఇచ్చేందుకు పారదర్శకమైన యంత్రాంగాన్ని తయారుచేశాం. ఆవిష్కరణలు అంటే కేవలం ఐటి ఆధారిత సాంకేతికలు మాత్రమే కాదు. గ్రామాల నుంచి గ్లోబల్ స్థాయి వరకు అన్నిరంగాల్లో ఆవిష్కరణలు జరగాలి. యువత వినూత్న ఆలోచనలతో ఆవిష్కరణలు చేస్తే యావత్ ప్రపంచం మీరు తయారుచేసే ఉత్పత్తులను ఆదరిస్తుంది. ఆరోగ్య సంరక్షణ, బయో డిగ్రేడబుల్ వంటి రంగాల్లో ఔత్సాహికులకు అపారమైన అవకాశాలున్నాయి.

యువత తమ వినూత్నమైన ఆలోచనలకు పదును పెడితే వారికి అన్నివిధాలా సహకరించేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. విద్యుతోపాటు నవీన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకే రతన్ టాటా ఇన్నొవేషన్ హబ్ ఏర్పాటుచేశాం. అమర్ రాజా బ్యాటరీ, గ్రీన్ కో, జిందాల్, అదానీ, టాటా గ్రూప్ వంటి పరిశ్రమ దిగ్గజాలు మా వద్ద ఉన్నారు, మీ ఆలోచనలను తదుపరి దశకు తీసుకెళ్లడానికి మార్గదర్శకత్వం వహించేందుకు వారు సిద్ధంగా ఉన్నారు. ఔత్సాహికులకు వనరులతోపాటు అన్నివిధాలా అండగా నిలిచేందుకు దిగ్గజ పారిశ్రామికవేత్తలతో ఒక వినూత్నమైన నమూనాను రూపొందించాం. యువత చేపట్టే నవీన ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో చంద్రబాబునాయుడు ఎల్లప్పుడూ ముందుంటారు. గతంలో ప్రతి ఇంటికి ఒక ఐటి ప్రొఫెషనల్ ఉండాలని ఆయన అన్నారు. ఈరోజు రాష్ట్రంలో ప్రతికుటుంబానికి ఒక పారిశ్రామికవేత్త తయారు కావాలని ఆయన కోరుకుంటున్నారు. రాష్ట్రంలో 1.3 కోట్ల కుటుంబాలు ఉన్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు గారి నేతృత్వంలో మీకు అన్నివిధాలా సహాయ, సహకారాలు అందించేందుకు నాలాంటి యువమంత్రులు సిద్ధంగా ఉన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ జాతీయస్థాయిలో స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా వంటి అద్భుతమైన కార్యక్రమాలను అమలుచేస్తున్నారు. మేకిన్ ఇండియా వంటి పథకాల మద్దతు కూడా పొంది మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ గా ఎపిని తీర్చిదిద్దేందుకు కలసికట్టుగా ముందడుగు వేద్దాం. సవాళ్లను అవకాశాలుగా మలచుకొని ముందుకు సాగుదాం. టాటాగ్రూప్, అమర్ రాజా, గ్రీన్ కో వంటి సంస్థల తమ ఉత్పత్తులను ప్రపంచానికి ఎగుమతి చేయడంలో ముందున్నారు. దేశీయంగా అనుసరిస్తున్న సులభతర, వేగవంతమైన వ్యాపార విధానాలు ఔత్సాహికులకు సహాయకారిగా ఉంటాయి. ఆంధ్రప్రదేశ్ లో ఇప్పుడు డబుల్ ఇంజన్ సర్కారు చురుగ్గా పనిచేస్తోంది. ప్రధాని మోడీజీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ భారతదేశ ఆవిష్కరణల కేంద్రంగా తయారవుతుందని నేను హామీ ఇస్తున్నానని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, టిజి భరత్, టాటా గ్రూప్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్, భారత్ ఫోర్జ్ చైర్మన్ బాబా కళ్యాణి, అమర్ రాజా గ్రూప్ చైర్మన్ గల్లా జయదేవ్, ఎపి పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, ఐటి శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## అమరావతిలోహుడ్కో ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్..

(మొదటి పేజీ తరువాయి)

విజువల్ ఆర్ట్ గ్యాలరీ, హోటల్, అతిథి గృహాలు, రెస్టారెంట్లు, సాంస్కృతిక వేదికలు, ఆధునిక సెక్రటేరియట్, డాక్యుమెంటేషన్ సెంటర్, స్విమ్మింగ్ పూల్, ఎగ్జిబిషన్ హాల్స్ వంటి అత్యాధునిక సదుపాయాలు ఏర్పాటుకానున్నాయని మంత్రి తెలిపారు. హుడ్కో ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ అమలులోకి రావడంతో అమరావతి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఫైనాన్స్, వనరులు, నైపుణ్యాల సమాహార కేంద్రంగా ఎదగనుందని డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. ఈ ప్రాజెక్టు సాధనకు సహకరించిన కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. దేశ అభివృద్ధికి మార్గనిర్దేశం చేస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## యువ ఆంధ్ర ఛాంపియన్‌షిప్ ప్రారంభం



**విజయవాడ , (జర్నలిస్ట్ ఫైల్):**విజయవాడ చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో యువ ఆంధ్ర ఛాంపియన్‌షిప్-2025 ఘనంగా ప్రారంభమైంది. రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...కబడ్డీ వంటి స్వదేశీ ఆటలకు ప్రోత్సాహం అందించడం, యువ ప్రతిభను వెలికితీయడం ఈ ఛాంపియన్‌షిప్ ప్రధాన ఉద్దేశ్యం. భవిష్యత్తులో తెలుగు కబడ్డీ లీగ్‌కి చేరే క్రీడాకారులకు ఇది ఒక మంచి వేదిక" అని తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో 8 జట్లు పోటీపడుతున్నాయి.

# ఆవిష్కరణల కేంద్రంగా ఆంధ్రా





(మొదటి పేజీ తరువాయి)

ఈ అవకాశాలను రాష్ట్రం అందిపుచ్చుకోవాలి. దీని కోసం రాష్ట్రాన్ని, అమరావతి సహా వివిధ ప్రాంతాలను సిద్ధం చేస్తున్నాం. ప్రాంతాల వారీగా అభివృద్ధి ప్రణాళికలు రచించాం. అమరావతి నగరాన్ని నిర్మించే అవకాశాన్ని దేవుడు నాకిచ్చాడు. క్వాంటం వ్యాలీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఇక విప్లవాత్మక అంశాలుగా మారబోతున్నాయి. నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేసి అంతర్జాతీయ ప్రమాణాలు సాధింటంలో మన పరిశ్రమలు మెరుగైన ఫలితాలు సాధించాలి. ప్రభుత్వం, పరిశ్రమలు, పరిశోధనలు, ఎకో సిస్టం ఉంటేనే అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఉత్పత్తులు అందించగలం. దీంట్లో భాగంగానే అమరావతి నగరం క్వాంటం కంప్యూటింగ్ హబ్ గా అభివృద్ధి చెందుతుంది. క్వాంటం కంప్యూటింగ్ ద్వారా రియల్ టైమ్ డేటాను విశ్లేషించి క్షేత్రస్థాయిలో అమలు చేస్తాం." అని చంద్రబాబు చెప్పారు.

**సంపద ఫుల్... సంక్షేమం డబుల్ :**"మరింత సంపద సృష్టించాలి. అప్పుడు ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది... సంక్షేమం చేయవచ్చు. కమ్యూనిజం, కేపటలిజం ఏమీ ఉండదు. టూరిజమే ఉంటుంది. టూరిజం కూడా అత్యధిక ఉపాధి కల్పించే రంగం. ప్రతి నియోజకవర్గంలో ఒక ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయడమే లక్ష్యం. ఒక వైపు సందప సృష్టిస్తూనే.. పేదల అభివృద్ధికి కృషి చేస్తున్నాం. పీ4 కింద పేదరికాన్ని రూపుమాపేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. ఓవైపు సంపద సృష్టి.. మరోవైపు పేదల జీవన ప్రమాణాల్ని మెరుగుపర్చేందుకు కృషి చేస్తున్నాం. వెల్తీ, హెల్తీ, హ్యాపీ సొసైటీగా ఏపీని మారుస్తాం. ప్రజల జీవన ప్రమాణాలను పెంచటమే లక్ష్యం. 704 పౌర సర్వీసులు వాట్సప్ గవర్నెన్సు ద్వారా ప్రజలకు అందుతున్నాయి. డేటా లేక్ ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమాచారం, పౌరసేవలు ఇలా అన్నిటినీ అనుసంధానం చేశాం. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం డిజినెర్వ్ సెంటర్ ప్రాజెక్టులోనూ టాటాతో కలిసి పనిచేస్తున్నాం. ప్రస్తుతం కుప్పంలో అమలు అవుతోంది. దీనికి సంజీవని అని పేరు పెట్టాం. సంజీవని ద్వారా ప్రపంచంలో ఉన్న వైద్య చికిత్సల టెక్నాలజీని ఒక చోటకు తెచ్చి రాష్ట్రంలోని అందరి ఆరోగ్యాన్ని పరిరక్షించాలన్నది మా లక్ష్యం." అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ..."స్టార్టప్ లకు ఎన్నో అవకాశాలున్నాయి. ఇన్నోవేషన్ కేంద్రాల ద్వారా ఆరోగ్యం, డిఫెన్సు, వ్యవసాయం ఇలా వేర్వేరు రంగాల్లో పరిష్కారాలకు అవకాశాలున్నాయి. ఇన్నోవేషన్ హబ్ ల ద్వారా స్థానిక, ప్రాంతీయ, దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో అంశాలకు పరిష్కారం దొరుకుతుంది. ఎన్నో ఆలోచనల సమాహారంగా ఈ రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ మారుతుందని ఆశిస్తున్నా. సీఎం చంద్రబాబు తన దార్శనికతతో కొద్ది సమయంలోనే రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ కు రూపం ఇచ్చారు." అని చెప్పారు.

**రికార్డుల స్థాయిలో రిజిస్ట్రేషన్లు :** ఏపీలో ఇన్నోవేషన్, బిజినెస్ స్టార్టప్ ల కోసం రికార్డు స్థాయిలో 1,67,321 రిజిస్ట్రేషన్లు జరిగాయి. 24 గంటల్లో ఈ స్థాయి రిజిస్ట్రేషన్లు జరగటంపై ఏపీ ఇన్నోవేషన్ సొసైటీకి గిన్నిస్ వరల్డ్ రికార్డు నమోదైంది. గిన్నిస్ వరల్డ్ రికార్డును ఆ సంస్థ ప్రతినిధులు సీఎం చంద్రబాబుకు అందచేశారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభోత్సవం సందర్భంగా మయూరి టెక్ పార్క్ ప్రాంగణంలో వివిధ స్టార్టప్ కంపెనీలు తమ ఉత్పత్తులను ప్రదర్శించిన స్టాళ్లను ముఖ్యమంత్రి పరిశీలించారు. రతన్ టాటా ఇన్నోవేన్ హబ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంత్రులు నారా లోకేష్ , నాదెండ్ల మనోహర్, టీజీ భరత్, భారత్ ఫోర్జ్ చైర్మన్ బాబా కల్యాణి, అమర్ రాజా బ్యాటరీస్ చైర్మన్ గల్లా జయదేవ్ తదితరులు హాజరయ్యారు.

## స్త్రీ శక్తి పథకం.. సూపర్ సక్సెస్

(మొదటి పేజీ తరువాయి)



చేసారని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు సుమారు ?25 కోట్లు ఖర్చయిందని, ఆ మొత్తం మొత్తాన్ని ఏపీఎస్‌ఆర్టీసీకి చెల్లిస్తున్నామని వివరించారు.

ఘాట్ రోడ్ల విషయంలో మొదట్లో వచ్చిన కొన్ని విమర్శలను గంటల్లోనే పరిష్కరించామని చెప్పారు. ప్రతిపక్షాల్లో ఉన్న మాజీ ఎమ్మెల్యేలు కూడా స్త్రీ శక్తి పథకం అమలును కొనియాడటం రాష్ట్ర ప్రభుత్వానికి గర్వకారణమని తెలిపారు.

**భవిష్యత్ ప్రణాళికలు :** త్వరలోనే 750 ఎలక్ట్రిక్ ఏసీ బస్సులు రానున్నాయని, రాబోయే 4 ఏళ్లలో 2500 ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెట్టనున్నామని తెలిపారు. వచ్చే 2 ఏళ్లలో పల్లె వెలుగు బస్సులలో కూడా ఏసీ సౌకర్యం కల్పించనున్నామని ప్రకటించారు.

తిరుమల మినహా రాష్ట్రంలోని అన్ని ఘాట్ రోడ్లలో మహిళలకు ఉచిత ప్రయాణం వర్తిస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్ర బోర్డర్ ప్రాంతాల్లో ఉన్న సమస్యలను వారం రోజుల్లో పరిష్కరిస్తామని మంత్రి మండిపల్లి తెలిపారు.

**మహిళలకు ప్రత్యేక గుర్తింపు :** కండక్టర్ల కొరత అంశం తమ దృష్టికి వచ్చిందని, తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. పురుషులు ఇబ్బందులు పడుతున్నారనే అంశంపై ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదని స్పష్టం చేశారు. భవిష్యత్తులో మహిళలకు ప్రత్యేక గుర్తింపు కోసం స్మార్ట్ కార్డ్ జారీ చేసే ఆలోచన ఉందని మంత్రి ప్రకటించారు.

**పెట్టుబడులపై స్పష్టత :** పెట్టుబడిదారులను రాష్ట్రానికి ఆకర్షించడంలో భాగంగా మాత్రమే భూములను కేటాయిస్తున్నామని, ఆ భూములు పూర్తిగా ఏపీఎస్‌ఆర్టీసీ ఆధీనంలో ఉన్నవే అని స్పష్టం చేశారు.

**మా పూర్వజన్మ సుకృతం :** ఈ పథకం అమలు చేయగలగడం మా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాం. స్త్రీ శక్తి భారం కాదు, ఇది రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత. మహిళల ఆశీస్సుల వలననే చంద్రబాబు నాలుగోసారి ముఖ్యమంత్రిగా అయ్యారు. మహిళల కోసం ఈ పథకాన్ని ప్రారంభించడం గర్వకారణం" అని అన్నారు.

ఈ సమావేశంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ, ఎండీ ద్వారక తిరుమల రావు, రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, విజయవాడ జోనల్ ఛైర్పర్సన్ రెడ్డి అప్పలనాయుడు, ఆర్టీసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కర్నూలు జిల్లాలో విషాదం.. ఆరుగురు చిన్నారుల మృతి

(మొదటి పేజీ తరువాయి)

ఈ క్రమంలో కుంటలో ఈతకు దిగిన విద్యార్థుల్లో శశికుమార్, కిన్నెర సాయి, సాయి కిరణ్, భీమా, వీరేంద్ర, మహబూబ్ ప్రాణాలు కోల్పోయారు. మరో విద్యార్థి గ్రామంలోకి వెళ్లి ప్రమాదం విషయం తెలిపాడు. ఆరుగురు చిన్నారులు మృతి చెందడంతో చిగలి గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

**సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి :** ఆరుగురు చిన్నారులు మృతి చెందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఐదో తరగతి చదువుతున్న ఆరుగురు విద్యార్థులు నీటికుంటలో ఈతకు దిగి మృతి చెందడంపై విచారం వ్యక్తం చేశారు. ఎంతో భవిష్యత్ ఉన్న చిన్నారుల మృతి వారి కుటుంబాలకు తీరని కడుపుకోత మిగిల్చిందన్నారు. ఈ ఘటన అత్యంత దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపిన సీఎం.. ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

## నరేగా బిల్లులకు మోక్షం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** 2014-19 మధ్య కాలంలో జరిగిన నరేగా (MGNREGS) పనులకు బిల్లుల చెల్లింపు విషయంలో కూటమి ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వం కుట్ర పూరితంగా నాటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జరిగిన నరేగా పనులకు బిల్లులు చెల్లించలేదు. బిల్లులు ఇవ్వకుండా వర్కులను క్లోజ్ చేసింది. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం దీనిపై ప్రత్యేక శద్ధ పెట్టింది. కేంద్ర ప్రభుత్వ పెద్దలతో సిఎం చంద్రబాబు ఈ విషయంపై పలు మార్లు చర్చించి నిధుల చెల్లింపులకు ఉన్న అడ్డంకులను తొలగించారు. ఇందులో భాగంగా వైసీపీ ప్రభుత్వం క్లోజ్ చేసిన 3,54,177 పనులు ప్రస్తుతం ఆన్ గోయింగ్ వర్కులుగా మార్చుచేశారు. కేంద్రం ఇచ్చిన ఈ వెసులుబాటుతో పనులు చేసిన వారికి బిల్లులు చెల్లింపు చేయడం ద్వారా న్యాయం చేసే అవకాశం ఏర్పడింది. ఈ ప్రక్రియపై సిఎం చంద్రబాబు సచివాలయంలో బుధవారం మరో సారి సమీక్ష చేశారు. మొత్తం రూ. 179.38 కోట్ల బిల్లుల చెల్లింపునకు సంబంధించి 5.54 లక్షల పనులను ఆన్ గోయింగ్ వర్కులుగా నమోదు చేశారు. దీనికి సంబంధించి కసరత్తు పూర్తి చేసిన పంచాయతీ రాజ్ శాఖ రూ. 179 కోట్లకు గాను రూ. 145 కోట్లను ప్రస్తుతం అప్లోడ్ చేసింది. ఈమొత్తానికి సంబంధించి ఆర్థిక శాఖ ఎన్ఐసికి నిధులు విడుదల చేసింది. పనులు చేసిన చిన్న కాంట్రాక్టర్లు, గ్రామస్తుల అకౌంట్లలో 23వ తేదీన ఈ మొత్తం నిధులు జమకానున్నాయి. మిగిలిన మొత్తానికి సంబంధించి పలు సాకేంతిక కారణాలతో చెల్లింపు ప్రక్రియ నిలిచింది. అవసరమైన ఎస్టిమేషన్ లేకపోవడం, ఖర్చు చూపకపోవడం, ఆ పనిచేసిన ప్రాంతాలు పట్టణ ప్రాంతంలో విలీనం కావడం వంటి కారణాలతో ఆయా పనుల బిల్లుల చెల్లింపు ప్రక్రియ పెండింగ్‌లో ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. గత ప్రభుత్వం కొన్ని బిల్లులకు నిధులు ఇవ్వకుండానే చెల్లించనట్లు రిపోర్టుల్లో చూపింది.

ఈ కారణంగా వాటికి అవసరమైన చెల్లింపులు జరపడానికి సాంకేతిక సమస్యలు తలెత్తాయి. వీటిపైనా కసరత్తు చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వైసీపీ చెల్లించకుండా నిలిపివేసిన మొత్తం రూ. 329 కోట్ల నరేగా బిల్లుల చెల్లింపును ప్రభుత్వం దశలా వారిగా చెల్లింపులు చేపట్టింది. ఇందులో భాగంగా 23వ తేదీ జరిపే రూ. 145 కోట్ల చెల్లింపులతో కలిపి ఇప్పటి వరకు మొత్తం రూ. 250 కోట్లను చెల్లించినట్లు అవుతుంది. గ్రామాల్లో చిన్న చిన్న పనులు చేసి బిల్లుల కోసం ఎదురుచూస్తున్న వారి కష్టాలకు ముగింపు పలికినట్లు అయ్యింది. వేలమంది ఈ చెల్లింపుల ద్వారా ఆర్థిక వెసులబాటు పొందనున్నారు. బిల్లుల చెల్లింపుపై ఏడాది కాలంగా ప్రత్యేక శ్రద్ధతో ముఖ్యమంత్రి రెగ్యులర్‌గా సమీక్షించి ఈ సమస్యను పరిష్కరించారు.

# అర్హులకే పింఛన్

(మొదటి పేజీ తరువాయి)




అర్హతలను మార్చి పింఛనుదారులకు అన్యాయం చేసే విధంగా కూటమి ప్రభుత్వం ఏ మాత్రం ప్రవర్తించడం లేదని ఆయన తెలిపారు. బుధవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పింఛను పథకం క్రింద దివ్యాంగులకు ప్రభుత్వం ఇచ్చే రూ. 6,000/- ల పింఛనును గత ప్రభుత్వం హయాంలో అనర్హులకు కూడా మంజూరు చేసి దుర్వినియోగం చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో మొత్తం 7.86 లక్షల మంది దివ్యాంగ పింఛన్లను పొందడం జరుగుచున్నదని, వారిలో 5.10 లక్షల మందికి చెందిన సదరం సర్టిఫికెట్లను పున:పరిశీలించేందుకు నోటీసులు జారీచేయడం జరిగిందన్నారు. అయితే ఇప్పటి వరకూ 4.50 లక్షల మంది వారి సర్టిఫికెట్లను తనిఖీ చేయించుకోగా, వారిలో దాదాపు ఒక లక్ష మంది అనర్హులు ఉన్నట్లు గుర్తించడమైందన్నారు. అదే విధంగా మిగిలిన వారు తమ సర్టిఫికెట్లను రీవెరిపై చేయించుకొనేందుకు ముందుకు రాలేదన్నారు. వీరందరికీ మరో సారి నోటీసులు జారీ చేస్తామని, అప్పటికీ వారు ముందుకు రాకపోతే వారి పింఛన్లను నిలుపుదల చేస్తామని తెలిపారు. అయితే వైద్యులు ఎవరిని అయితే అనర్హులుగా ధృవీకరించారో వారు మరో సారి తమ అర్జీని మండల అభివృద్ధి అధికారికిగాని, మున్సిఫల్ కమిషనర్ కు గాని అందజేసినట్లతై మరో సారి వారి అర్హతను పరిశీలించడం జరుగుతుందన్నారు.

రాష్ట్రంలో అన్ని జిల్లాలో సదరం సర్టిఫికెట్ల రీవెరిఫికేన్ జరిగిందని, అయితే అత్యధికంగా పులివెందులలోనే 1,708 మంది బోగస్ పింఛను దారులు ఉన్నట్లు గుర్తించడమైందన్నారు. అదే విధంగా మచిలీపట్నంలో 1,539 మంది, చంద్రగిరిలో 1,604 మంది బోగస్ పింఛనుదారులను గుర్తించడమైందన్నారు. అదే విదంగా అత్యల్పంగా కాకినాడలో 19 మంది, విశాఖ దక్షిణ నియోజక వర్గంలో 39 మంది మరియు తాడికొండలో 55 మంది బోగస్ పింఛనుదారులను గుర్తించడం జరిగిందన్నారు.

అర్హులకు మాత్రమే ఎన్టీఆర్ భరోసా పింఛన్లను అందజేయాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం ఎంతో పారదర్శకంగా వ్యవహరిస్తుంటే, ఇటు వంటి ప్రయత్నాన్ని ప్రధాన ప్రతిపక్ష పార్టీ, ఇతర పార్టీలు ఏ విధంగా తప్పుపడతాయని ఆయన ప్రశ్నించారు. పింఛన్లను ఎదో విధంగా తొలగించాలనే ఉద్దేశ్యంతో తమ ప్రభుత్వం లేదని, దేశంలోనే అత్యధికంగా పింఛన్లు, పింఛను సొమ్ము ఇచ్చేది తమ కూటమి ప్రభుత్వం అనే విషయాన్ని రాష్ట్ర ప్రజలు అందరూ గుర్తించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గత ప్రభుత్వం రూ. 3 వేల పింఛను ఇస్తానని హామీ ఇచ్చి ఘోరంగా మోసం చేయడం జరిగిందని, అయితే తమ ప్రభుత్వం రూ. 3 వేల నుండి రూ. 4 వేలకు పెంచడమే కాకుండా, అధికారంలోకి వచ్చే మూడు మాసాల ముందు నుండే పెంచిన పింఛను ఎరియర్స్ ను కూడా పింఛను దారులకు చెల్లించడం జరిగిందన్నారు. దేశంలోనే అత్యదికంగా పింఛన్లను ఇస్తున్నది తమ కూటమి ప్రభుత్వం అని, దివ్యాంగులకు రూ. 6 వేలు, మంచంమీద నుండి లేవలేని అంగవికలురకు రూ. 15 వేలు, దీరకాలిక వ్యాధిగ్రస్తులకు రూ. 10 వేల పింఛను తమ ప్రభుత్వం అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ విధంగా తమ ప్రభుత్వం దాదాపు 65 లక్షల మంది పింఛన్లు అందజేస్తుంటే, గత ప్రభుత్వం సిక్స్ స్టెప్ వేలిడేషన్ అని, ప్యామిలీ మ్యాపింగ్ అంటూ కొన్ని లక్షల మంది పింఛన్లను రద్దు చేయడం జరిగిందన్నారు. కుటుంబ పెద్ద చనిపోతే, వారి స్థానంలో భార్యకు వితంతు పింఛనును కూడా తమ ప్రభుత్వం మంజూరు చేయడం జరుగుచున్నదన్నారు.

**రాష్ట్ర ఇమేజ్ ను డ్యామేజ్ చేసే విధంగా విషం చిమ్ముతున్నది :** రాష్ట్ర ఇమేజ్ ను డ్యామేజ్ చేసే విధంగా ప్రధాన ప్రతిపక్షపార్టీ విషం చిమ్మడం ఎంతో దురదృష్టకరమన్నారు. విభజనతో ఎంతగానో నష్టపోయిన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు రాజకీయ విబేదాలను ప్రక్కనపెట్టి అన్ని రాజకీయ పార్టీలు కృషిచేయాల్సినదిపోయి, అభివృద్ధిని అడ్డుకునే విధంగా, రాష్ట్రాన్ని నాశనం చేసే విధంగా విషం చిమ్మడం దిగజారుడు రాజకీయానికి నిదర్శనం అని ఆయన అభివర్ణించారు.

రాష్ట్ర రాజధాని అమరావతి పై గత ప్రభుత్వానికి ఉన్న ద్వేషంతో ఎటు వంటి అభివృద్ధి పనులు నిర్వహించకపోవడం వల్లే నేడు రాజధాని ప్రాంతం ముంపుకు గురవ్వడానికి కారణమన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా దాదాపు 30 నుండి 50 వేల ఎకరాల వ్యవసాయ భూమి ఉన్న రాజధాని ప్రాంతంలో బారీ వర్షాలకు కొంత ఇబ్బంది రావటం సహజమేనని, దాన్ని భూతద్దంలో చూపుతూ రాజదాని ప్రాంతం ముంపుకు గురైందని చిలవలు పలవలుగా రాద్దాతం చేసే విదంగా దుష్ప్రచారం చేయడం అంటే రాష్ట్రాభివృద్ధిని ప్రధాన ప్రతిపక్ష పార్టీ అడ్డుకోవడమే అని ఆయన అన్నారు. రాజధాని ప్రాంతంలో భవిష్యత్తులో జరిగే నిర్మాణాలు, కట్టడాలు ఏ మాత్రం వరద నీటికి గురవ్వకుండా ఉండేందుకు అవసరమైన వరద నీటి పారుదల వ్యవస్థలను ప్రభుత్వం ప్రణాళికా బద్దంగా నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ముంబాయి, హైద్రాబాదు వంటి మహానగరాలు కూడా వరద నీటితో ముంపుకు గురవుతున్నాయని, అటు వంటిని నిర్మాణ దశలో ఉన్న అమరావతి రాజధాని ప్రాంతంలో అదిక వర్షాల వల్ల కురిసిన వరద నీరు నిల్వ ఉండటం సహమేనన్నారు.

**4 రోజుల్లో 47 లక్షల మంది ఉచిత బస్సు ప్రయాణాన్ని వినియోగించుకున్నారు :** మహిళల అభ్యున్నతిని, సంక్షేమాన్ని కాంక్షిస్తూ వారికి అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం 'స్త్రీ శక్తి' పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని అమలు చేయడం జరుగుచున్నదన్నారు. గత నాలుగుం రోజుల్లో దాదాపు 47 లక్షల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకున్నారని, తద్వారా రూ. 19 కోట్ల మేర ఆధాయాన్ని వారు పొందారని మంత్రి తెలిపారు. అయితే ఇటు వంటి మంచి పథకం పై కూడా విషం చిమ్మే విధంగా ప్రధాన ప్రతిపక్ష పార్టీ ప్రవర్తిస్తున్నదనే ఆవేదనను ఆయన వ్యక్తం చేశారు. కొండ ప్రాంతాల్లో భద్రత దృష్ట్యా ఉచి బస్సు ప్రయాణాన్ని తొలుత అనుమతించడలేదని, అయితే తదుపరి ఆ విషయాన్ని పున:పరిశీలించి ఇప్పుడు కొండ ప్రాంతాల్లో కూడా మహళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అనుమతించడం జరిగిందన్నారు.

రాష్ట్రంలో అపారమైన సహజ వనరులు ఉన్నాయని, వాటికి తోడు వృత్తి నైపుణ్యం యువత కూడా పెద్ద ఎత్తున ఉందని, వీటిని సద్వినియోగం చేసుకుంటూ రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వం అహర్నిశలూ కృషి చేస్తున్నదని, ప్రతి పక్ష పార్టీలు కూడా ఈ యజ్ఞానికి సహరిస్తూ రాష్ట్రాభివృద్ధికి చేయూతను అందజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# వచ్చే ఏడాదికి 10 లక్షల ఇళ్ల నిర్మాణం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో ప్రతీ పేద కుటుంబానికి సొంతిళ్లు ఉండాలని... ఇందుకోసం తలపెట్టిన గృహనిర్మాణ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది మార్చి నాటికి 10 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి కావాలనే లక్ష్యాన్ని నిర్దేశించిన ముఖ్యమంత్రి... వీటిలో 3 లక్షల ఇళ్లకు వచ్చే నెలలో గృహ ప్రవేశాలు జరగాలని స్పష్టం చేశారు. సంక్రాంతి కల్లా మరో 2 లక్షల ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలన్నారు. ప్రస్తుతం చేపట్టిన ప్రాజెక్టులను ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించి నిర్మాణం చేపట్టాలని సూచించారు. బుధవారం సచివాలయంలో గృహ నిర్మాణ శాఖపై అధికారులతో సమీక్షించిన సీఎం....రాష్ట్రంలో ఇంకా ఇళ్లులేని పేద కుటుంబాలను గుర్తించి జాబితా రూపొందించాలని ఆదేశించారు. దీనిపై 15 రోజుల్లోగా సర్వే పూర్తి చేయాలన్నారు. పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు పేద కుటుంబాలకు ఇస్తామన్న హామీ మేరకు అవసరమైన స్థలాలను గుర్తించాలన్నారు. పెద్ద కుటుంబాలకు ఉమ్మడి ఇళ్లు నిర్మించే యోచన చేయాలన్నారు. ఎన్టీఆర్ హౌసింగ్ పూర్తి చేసేందుకు విడతల వారీగా నిధులు ఇవ్వాలని చెప్పారు.

**త్వరలో 2,73,709 మంది లబ్ధిదారులకు రూ.919 కోట్ల చెల్లింపు :** రాష్ట్రానికి పీఎంఏవై(అర్బన్)బీఎల్సీ, పీఎంఏవై (గ్రామీణ్), పీఎం జన్మాన్ కింద మొత్తం 18,59,504 ఇళ్లు మంజూరు కాగా, వీటిలో ఇప్పటికి 9,51,351 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యింది. ఈ ఏడాది కాలంలోనే 2.81 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. వచ్చే నెలలో ఇంకో 19 వేల ఇళ్లు అందుబాటులోకి వస్తాయి. ఈ ఏడాది కాలంలో గృహ నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.2,013.50 కోట్లు ఖర్చు చేసింది.

రాష్ట్రంలో 50 శాతానికి పైగా ఇళ్ల నిర్మాణం పూర్తయిన మొత్తం 4,305 లేఅవుట్లలో... రహదారులు, డ్రైనేజీలు తదితర మౌలికవసతుల కోసం రూ.3,296.58 కోట్ల వ్యయం కానుంది. కుప్పం నియోజకవర్గంలో 4,647 మంది గృహ నిర్మాణ లబ్దిదారులకు రూ.16.37 కోట్లు చెల్లించగా, రాష్ట్రంలోని 2,73,709 మంది లబ్దిదారులకు రూ.919.29 కోట్లు త్వరలో చెల్లించనుంది. పీఎం జన్మాన్ కింద నిర్మించిన 15,753 ఇళ్లకు రూ.100 కోట్లు, పీఎంఏవై గ్రామీణ్ కింద నిర్మించిన 15,582 ఇళ్లకు రూ.75 కోట్ల నిధులు మంజూరు చేయనుంది. మరోవైపు పీఎంఏవై అర్బన్ కింద ఇళ్లు మంజూరైనప్పటికీ 1,84,510 మంది లబ్దిదారులు ఇంకా గృహ నిర్మాణం చేపట్టలేదని అధికారులు ముఖ్యమంత్రికి వెల్లడించారు.

**తుది దశకు 84,094 టిడ్కో ఇళ్ల నిర్మాణం :** 2018లో 104 పట్టణ స్థానిక సంస్థల్లో 4,54,706 టిడ్కో ఇళ్లకు టెండర్లు పిలవగా, వీటిలో ప్రస్తుతం 1,77,546 ఇళ్లు పూర్తయ్యాయి. వీటిలో 300 చ.అ. విస్తీర్ణం కలిగిన 45,848 ఇళ్లు, 365 చ.అ. విస్తీర్ణం ఉన్న 12,550 ఇళ్లు, 430 చ.అ. విస్తీర్ణం ఉన్న 25,172 ఇళ్లు... మొత్తం 83,570 ఇళ్లను లబ్దిదారులకు ప్రభుత్వం అందించింది. మరో 84,094 టిడ్కో ఇళ్ల నిర్మాణం తుది దశకు చేరింది.

## యుపిహెచ్‌సి ఉద్యోగులకు మినిమం టైంస్కేల్ తప్పనిసరి



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల ఉద్యోగులకు కనీస టైంస్కేల్ అమలు చేయాలని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ జేఏసీ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. విజయవాడలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశానికి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ జేఏసీ చైర్మన్ ఏ.వి. నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఓ 686 ప్రకారం వేతనాలు ఇవ్వకపోవడం గత ప్రభుత్వ నిర్లక్ష్యమని విమర్శించారు. వైద్య, ఆరోగ్యశాఖలోని ఇతర కాంట్రాక్ట్ ఉద్యోగులతో సమాన హక్కులు కల్పించాలని, కేంద్ర గైడ్‌లైన్స్ మేరకు హ్యూమన్ రిసోర్స్ పాలసీని అమలు చేయాలని స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం కోసం యుపిహెచ్‌సి ఉద్యోగులు చేపట్టే పోరాటాలకు సంపూర్ణ మద్దతు ఇస్తామని తెలిపారు. రాష్ట్ర కమిటీ నిర్ణయాల ప్రకారం ఆగస్టులో అన్ని జిల్లాల్లో ఉద్యోగుల సమావేశాలు నిర్వహించనున్నారు. సెప్టెంబర్‌లో జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేయగా, అక్టోబర్‌లో ఉద్యోగులందరి సంతకాలతో విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించనున్నారు. ఈ సమావేశానికి 15 జిల్లాల ఆఫీస్‌బేరర్లు హాజరయ్యారు.

## నేతన్నలకు ముద్ర రుణాలు ఇవ్వాలి



**అమరావతి,(జర్నలిస్ట్ ఫైల్):** అర్హులైన నేతన్నలకు సకాలంలో ముద్ర రుణాలు అందజేయాలని, ఈ ఏడాది డిసెంబర్ నాటికి 70 శాతం మేర రుణాలు మంజూరు చేయాలని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత ఆదేశించారు. మంగళగిరిలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ చేనేత కుటుంబాలకు ఉచిత విద్యుత్ ఫలాలను అందించాలన్నారు. ఆప్కో అమ్మకాలు పెంచి, నూతన డిజైన్లతో తయారు చేసిన దుస్తులను సోషల్ మీడియా, ఈ కామర్స్ వేదికల ద్వారా విస్తృతంగా ప్రాచుర్యం కల్పించాలని సూచించారు. సహకార సంఘాల ఏర్పాటులో అలసత్వం సహించబోమని హెచ్చరిస్తూ, త్వరితగతిన కొత్త సంఘాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 92 ఆప్కో షోరూముల ద్వారా అమ్మకాలను మరింత పెంచి, వినియోగదారులకు వేగవంతమైన సేవలు అందించాలన్నారు. చేనేత సంక్షేమ పథకాలపై గ్రామ స్థాయిలో సక్సెస్ మీట్లు నిర్వహించి, 50 ఏళ్లకే పెన్షన్, నేతన్న భరోసా కింద రూ.25 వేల ఆర్థిక సాయం, ఉచిత విద్యుత్, త్రిఫ్ట్ ఫండ్, జీఎస్టీ మినహాయింపులు వంటి పథకాలపై విస్తృత ప్రచారం కల్పించాలని మంత్రి సవిత స్పష్టం చేశారు.

## ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో దీర్ఘ సుమంగళీభవ



**మంగళగిరి, (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో మంగళగిరి నియోజకవర్గంలోని దళిత కుటుంబాలకు పెండ్లి కానుకను అందించాలనే లక్ష్యంతో దీర్ఘ సుమంగళీభవ కార్యక్రమం పేరుతో నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు కనికళ్ల చిరంజీవి బంగారు మంగళ సూత్రాలను అందజేస్తోన్నారు. మంగళగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ తన సొంత నిధులతో పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. అందులో భాగంగా

కుల, మతాలకు అతీతంగా నియోజకవర్గ పరిధిలో జరిగే వివాహాలకు పెండ్లి కానుకగా నవ వధూవరులకు స్థానిక టీడీపీ నేతల చేతుల మీదుగా నూతన వస్త్రాలను అందజేయిస్తున్న విషయం విదితమే. ఈ నేపధ్యంలో మంత్రి లోకేష్ ను స్ఫూర్తిగా తీసుకున్న నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు కనికళ్ల చిరంజీవి తన సొంత ఖర్చులతో దళిత కుటుంబాల వివాహాల సందర్భంగా సుమారు రూ.9వేల విలువైన బంగారు మంగళ సూత్రాలను కానుకగా అందజేస్తోన్నారు. గత మూడేళ్ల క్రితం 2022 డిసెంబర్ 25న క్రిస్మస్ పండుగ రోజు ప్రారంభమైన ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటి వరకూ నియోజకవర్గంలోని 255 మంది దళితులకు బంగారు మంగళ సూత్రాలను పంపిణీ చేశారు. వివాహానికి వారం రోజుల ముందు టీడీపీ కార్యాలయంలో ఆహ్వాన పత్రిక అందజేస్తే వరుని కుటుంబానికి బంగారు మంగళ సూత్రం అందజేయడం జరుగుతుందని, కావున నియోజకవర్గంలోని దళిత కుటుంబాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు కనికళ్ల చిరంజీవి కోరారు.

## బాలిక కిడ్నాప్, హత్య... నిందితుడికి యావజ్జీవం

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు జిల్లాలో మైనర్ బాలిక కిడ్నాప్, హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష ఖరారైంది. నాలుగో అదనపు జిల్లా జడ్జి, ఎస్సీ/ఎస్టీ ప్రత్యేక కోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. నిందితుడు నరమామిడి నాగరాజు ఏ చిన్నికి యావజ్జీవంతో పాటు రూ.1,100 జరిమానా విధించింది. గతేడాది జూలై 15న చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామానికి చెందిన 13 ఏళ్ల బాలికను కిడ్నాప్ చేసి, గొంతు నులిమి హత్య చేసిన ఘటన కలకలం రేపింది. బాలిక తల్లితో నిందితుడికి ఉన్న అక్రమ సంబంధం విఫలమవ్వడంతో ప్రతీకారంగా ఈ హత్యకు పాల్పడినట్లు పోలీసులు దర్యాప్తులో తేలింది. నాలుగు నెలలు సెల్‌ఫోన్ వాడకుండానే తప్పించుకున్న నిందితుడిని పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు పంపారు. రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాల్లోనూ ఎనిమిది బృందాలతో గాలింపు జరిపారు. తెనాలి డీఎస్పీ జనార్ధనరావు పర్యవేక్షణలో పోలీసులు ఆధారాలు సేకరించి కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణ అనంతరం కోర్టు నిందితుడిని దోషిగా తేల్చి కఠిన శిక్ష విధించింది. ఈ కేసులో దర్యాప్తు చేసిన బృందాన్ని, ప్రజా అభియోగాధికారిని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అభినందించారు.

## ప్రజల సహకారంతోనే అభివృద్ధి కొనసాగింపు

- అక్రమణకల తొలగింపు విషయంలో ప్రజలకు అర్థమయ్యేలా చెప్పండి
- ముందస్తుగా ప్రజలు, ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వండి
- హుస్సేన్ నగర్ లో ఆక్రమణల తొలగింపు సందర్భంగా అధికారులకు సూచించిన ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆక్రమణలు తొలగించాలని, అభివృద్ధి గురించి వారికి వివరించి సహకారం తీసుకోవాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే నసీర్ అధికారులకు సూచించారు. బుధవారం గుంటూరు మున్సిపాలిటీ అధికారులు స్థానిక హుస్సేన్ నగర్ లో అక్రమణ తొలగింపు చేపట్టారు. దీంతో స్థానికులు ఎమ్మెల్యే నసీర్ కు సమాచారం ఇవ్వడంతో ఆ ప్రాంతానికి వెళ్లారు. తమకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఆక్రమణలు తొలగిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుంటూరు నగరాభివృద్ధికి ప్రజల సహకారం పూర్తిగా అవసరమని అధికారులకు తెలిపారు. అక్రమణలు ఎందుకు తొలగించాల్సి వస్తుంది ? ఎలాంటి ఉపయోగం ఉంది అనే అంశాల గురించి ప్రజలకు నచ్చ చెప్పాలని సూచించారు.

నగరంలో ఎలాంటి ఆక్రమణలు తొలగించాలన్న ప్రజలకు, ప్రజాప్రతినిధులకు తెలియజేయాలని సూచించారు. ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంతంలో నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తుంటారని, అధికారులు సంయమనంతో ముందుకు వెళ్లాలని చెప్పారు. ప్రజలు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలను ప్రణాళిక ప్రకారం చేపట్టాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. అనంతరం హుస్సేన్ నగర్ వాసులు తాము అభివృద్ధికి సహకరిస్తామని ఎమ్మెల్యే నసీర్‌కు తెలియజేశారు.

## కోర్టు సస్పెండ్ చేసిన అయ్యగారు విధుల్లోనే...





**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారిమఠంలో గుడిలో ఏమి జరుగుతుందో ఎవరికీ అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని స్థానికులు అంటున్నారు. పూర్వపు మఠాధిపతి మరణించడంతో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి గుడి వ్యవహారం పెద్ద రచ్చయిపోయిందనడంలో సందేహం లేదేమో..?! ప్రస్తుతం మఠాధిపతి వ్యవహారంలో ఇరువర్గాలు కోర్టుకు వెళ్లి ఎత్తులు పై ఎత్తుల పై వ్యవహారాన్ని కొనసాగించడం జరుగుతుంది. అయితే ఈమధ్య ప్రస్తుతం ఇక్కడ పనిచేయుచున్న ఫిట్ పర్సన్ పై దివంగత పీఠాధిపతి రెండవ భార్య కోర్టును ఆశ్రయించగా కోర్టు గతవారం బ్రహ్మంగారి గుడిలో ఫిట్ పర్సన్ పోస్టును తొలగిస్తూ ప్రస్తుత వ్యవహారాలు నడిపేందుకై దేవాదాయ శాఖ కమిషనర్ కు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. అలాగే ఆరు వారాల్లో పీఠాధిపతి సమస్యను కూడా పరిష్కరించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. కోర్టు ఆదేశాలు ఇచ్చి ఆర్డర్ కూడా ఫిట్ పర్సన్ నోటీసుకి తీసుకెళ్లిన మరియు సోషల్ మీడియాలో వచ్చినప్పటికీ ఇక్కడ ఉన్న ఫిట్ పర్సన్ మాత్రం గతంలో మాదిరే ఆయన విధులు సజావుగా కొనసాగిస్తున్నాడన్న కారణంతో బుధవారం సాయంత్రం మారుతి మహాలక్ష్మి ప్రెస్ మీట్ పెట్టడం కూడా జరిగింది. అయితే ఇక్కడ ఉన్న ఫిట్ పర్సన్ మాత్రం తనకు తమ కార్యాలయం నుండి తొలగిస్తున్నట్లు ఆర్డర్ రాలేదని అంటున్నట్లు సమాచారం.

హైకోర్టు ఆర్డర్ వచ్చి అన్ని సోషల్ మీడియాలలో హల్చల్ చేస్తున్న కూడా మరి ఆ శాఖ కమిషనర్ కు రాకుండా కేవలం మఠంలో ఉండే వాళ్లకే ఆర్డర్ ఎలా వస్తుంది అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అసలు ఇక్కడ ఏమి జరుగుతుంది అనేది ఇప్పుడు ప్రశ్నగా మారింది. ఈ గందరగోళానికి ఉన్నతాధికారులైన స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కందిమల్లాయపల్లె పుర ప్రజలు కోరుతున్నారు. అభివృద్ధికి తాను ఇప్పటికి వ్యతిరేకం కాదని కానీ సరైన మార్గంలో అభివృద్ధి జరగలేదని ఫిట్ పర్సన్ అవినీతికి పాలపడుతున్నారనీ అందుకే కోర్టు ను ఆశ్రయించారని ఓ ప్రకటనలో తెలిపింది.. చివరగా అసిస్టెంట్ కమిషనర్ ను వివరణ కోరగా కమిషనర్ నుండి మాకు ఎలాంటి ఆదేశాలు రాలేదు అవి వచ్చేంతవరకు డ్యూటీలో కొనసాగుతారు అని చెప్పడం జరిగింది.

## ఉద్యోగుల సమస్యల సానుకూల పరిష్కారానికి అన్నివిధాలా ప్రయత్నం చేస్తాం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో పనిచేస్తున్న వివిధ ప్రభుత్వ ఉద్యోగులు, ఫెన్సనర్ల సమస్యల సానుకూల పరిష్కారానికి అవసరమైన ప్రయత్నం చేయడం జరుగుతుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వారి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన పలు అంశాలపై చర్చించేందుకు బుధవారం రాష్ట్ర సచివాలయంలో సిఎస్ అధ్యక్షతన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈసమావేశంలో వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఉద్యోగులకు సంబంధించి పెండిగ్ డిఏలు, పిఆర్సి బకాయిలు, ఆర్జిత సెలవుల నగదు చెల్లింపు బాకాయిలు తదితర అంశాలను సిఎస్ దృష్టికి తెచ్చారు. అనంతరం సిఎస్ మాట్లాడుతు ఈ ప్రభుత్వం వచ్చాక మొదటి సారి జరిగిన ఈ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తెలిపిన అన్ని అంశాలను నమోదు చేయడం జరిగిందని వాటన్నిటినీ ముఖ్యమంత్రి వర్యుల దృష్టికి తీసుకువెళ్ళి సకాలంలో పరిష్కారం అయ్యే విధంగా ప్రయత్నం చేయడం జరుగుతుందని సిఎస్ విజయానంద్ ఉద్యోగ సంఘాలకు చెప్పారు.

ఈసమావేశంలో సర్వీసెస్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్, వైద్య ఆరోగ్య ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి, టిఆర్ అండ్ బి ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, పిఆర్ అండ్ ఆర్డి ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఆర్థిక, ప్రణాళికా శాఖల ముఖ్య కార్యదర్శి పియూష్ కుమార్, విద్యాశాఖ కార్యదర్శి కె.శశిధర్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీ రావు, కళాశాల విద్యా డైరెక్టర్ భరత్ గుప్త, ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి గౌతమ్ అల్లాడ తదితర అధికారులు పాల్గొన్నారు.

అలాగే ఉద్యోగ సంఘాల నుండి ఎపి ఎన్జిజిఓ అధ్యక్షులు విద్యాసాగర్, ఎపి సచివాలయ ఉద్యోగుల సంఘం జనరల్ సెక్రటరీ మోహన్, రాష్ట్ర టీచర్స్ యూనియన్ అధ్యక్షులు శ్రీనివాస్, ఎపి ప్రోగ్రెస్సివ్ రికగ్నైజడ్ టీచర్స్ యూనియన్ అధ్యక్షులు కృష్ణయ్య, ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఎపి యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ ప్రసాద్, ఎపి టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు జి.హృదయరాజు, ఎపి గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు కె.సూర్యనారాయణ, ఎపి ఉపాధ్యాయ సంఘం నుండి బాలాజీ, ఎపి ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల సెంట్రల్ అసోసియేషన్ నుండి శ్రీనివాసరావు, ఎపి ప్రభుత్వ క్లాస్ 4 ఉద్యోగుల సెంట్రల్ అసోసియేషన్ నుండి మల్లేశ్వరరావు, ఎపి ప్రభుత్వ క్లాస్ 4 ఉద్యోగుల సెంట్రల్ అసోసియేషన్ నుండి శేఖర్, ఎపి కో ఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షులు ఫణి పేర్రాజు, ఎపి స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్(ప్రత్యేక ఆహ్వానితులు)వెంకటేశ్వరరావు, స్టేట్ గవర్నమెంట్ ఫెన్సనర్ల అసోసియేషన్ ఎపి(ప్రత్యేక ఆహ్వానితులు) శాస్త్రి మాట్లాడుతూ వివిధ ఉద్యోగులకు సంబంధించిన పలు పెండింగ్ అంశాలను సిఎస్ విజయానంద్ దృష్టికి తెచ్చారు.

## ఉద్యోగులు-ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం ఎప్పుడూ..?



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలు ఏవీ పరిష్కారం కాని పరిస్థితి నెలకొన్నదని గుంటూరు జిల్లా ఐక్యవేదిక చైర్మన్ చాంద్‌బాష ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు.

గత ప్రభుత్వం నుంచి ఈ ప్రభుత్వం వచ్చి 14 నెలలు గడిచినా ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదని, వేల కోట్ల రూపాయల బకాయిలు రెండేళ్లుగా పెండింగ్‌లోనే ఉన్నాయని తెలిపారు. 2023 జూలై 1 నుంచి అమల్లోకి రావలసిన 12వ వేతన సవరణ కమిటీని కూడా ఏర్పాటు చేయలేదని విమర్శించారు. అంతేకాక గత రెండేళ్లుగా ఒక్క డీఏ కూడా మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉద్యోగుల జీతాల నుండి నెలకు రూ.225 నుంచి రూ.300 వరకు కట్ చేస్తున్నప్పటికీ, ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ కింద నగదురహిత వైద్యం అందడం లేదని ఆయన విస్మయం వ్యక్తం చేశారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని, గత ప్రభుత్వంలాగే ప్రస్తుత ప్రభుత్వం కూడా వ్యవహరిస్తోందని ఆరోపించారు.

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఇచ్చిన సీపీఎస్ రద్దు హామీని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. "మా దీనగాథలు చెప్పుకోవడానికి వేదికే లేకుండా పోయింది...ఎవరికి చెప్పుకోవాలి?" అంటూ చాంద్‌బాష ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలపై ఇంతవరకు క్యాబినెట్ సబ్ కమిటీని కూడా ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కరిముల్లా, నగర శాఖ అధ్యక్షుడు వై. నాగేశ్వరరావు, నగర శాఖ కార్యనిర్వాహక కార్యదర్శి వి. పెదరత్తయ్య, తాడికొండ తాలూకా యూనిట్ అధ్యక్షుడు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## ఆయుష్ లైసెన్సుల రెన్యువల్‌కు ప్రత్యేక మేళాలు

**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** ఆయుర్వేద, హోమియో, యునాని మందుల తయారీ యూనిట్లు, దుకాణాల నిర్వహణ రెన్యువల్స్ కోసం ఆయుష్ శాఖ తొలిసారిగా ప్రత్యేక మేళాలను రాష్ట్రంలో నిర్వహించడం ప్రారంభించింది. ఈనెల 25నుండి మలి విడత మేళాలను నిర్వహించనున్నట్లు ఆయుష్ శాఖ డైరెక్టర్ కె.దినేష్‌కుమార్ నేడొక ప్రకటనలో తెలిపారు. ఆయుష్ శాఖ అడిషనల్ డైరెక్టర్లు, డ్రగ్ ఇన్ స్పెక్టర్లు, సహాయక సిబ్బంది ఆయుష్ మేళాకు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలకు చెందిన తయారీ యూనిట్లు, దుకాణాల యజమానులు, విక్రేతలు ఏలూరులోని ఆయుష్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో ఈనెల 25, 26 తేదీల్లో, ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన వారు ఆయుష్ రీజనల్ డిప్యుటీ డైరెక్టర్, ఓల్డ్ రిమ్స్ హాస్పిటల్, గవర్నమెంట్ ఆఫీసర్స్ కాంప్లెక్స్, ప్రకాశం భవన్ ఎదురుగా, ఒంగోలు చిరునామాలో సెప్టెంబర్ 1, 2 తేదీల్లో, ఉమ్మడి కర్నూలు, వైయస్సార్ కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాల వారు ఆయుష్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం, ఓల్డ్ రిమ్స్ , 8-రోడ్స్ దగ్గర, కడప చిరునామాలో సెప్టెంబర్ 8, 9 తేదీల్లో హాజరుకావాలని ఆయుష్ శాఖ డైరెక్టర్ కోరారు. లైసెన్సులు రెన్యువల్ చేయడంతో పాటు వారివారి సమస్యల పరిష్కారం కోసం ఈ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## సహకార బ్యాంకు పదవుల్లో సామాజిక వర్గాల వారీగా డైరెక్టర్లను నియమించాలి: సీపీఐ

**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్)** బ్రహ్మంగారిమఠంలో మండలంలోని సహకార బ్యాంకుకు సంబంధించిన పదవుల్లో అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మండల కార్యదర్శి పెద్దలపల్లి ప్రభాకర్ డిమాండ్ చేశారు ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి చెందిన సహకార బ్యాంకు కు సంబంధించి చైర్మన్ రెండు డైరెక్టర్ల పదవులను చైర్మన్ పదవి ఓసి సామాజిక వర్గానికి డైరెక్టర్ల పదవి ఒకటి బీసీ సామాజిక వర్గానికి ఒకటి ఓసి సామాజిక వర్గానికి కేటాయించడం జరిగింది మైదుకూరు శాసనసభ్యులు బ్రహ్మంగారిమఠం మండలంలో అత్యధిక మూడో స్థానం కలిగిన ఎస్సీలకు ఈ పదవుల్లో ఒకటి కేటాయిస్తే బాగుంటుంది ఆ కేటాయింపుల్లో చైర్మన్ డైరెక్టర్ రెండు పదవులు ఒకే సామాజిక వర్గానికి కేటాయించడం వెనుక ఎస్సీలపై వివక్ష స్పష్టంగా కనబడుతుంది ఈ మండలంలో ఎస్సీలు ఓట్లు వేయలేదా వారు లేరా అని ఆయన ప్రశ్నించారు అన్ని సామాజిక వర్గాలకు సమానంగా కల్పిస్తేనే భవిష్యత్తులో గుర్తించబడిన వారవుతారు కేవలం రెండు సామాజిక వర్గాలకే మద్దతు తెలపడం వల్ల ఎస్సీలు కేవలం ఓట్లకే పనికొస్తారా పదవులకు పనికిరారా అని ఆయన ఎద్దేవా చేశారు .

# 2029 కల్లా అర్హులైన పేదలు అందరికీ ఇళ్లు




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలోని అర్హులైన నిరుపేదలు అందరికీ 2029 కల్లా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆదేశించినట్లు రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్థసారథి తెలిపారు. బుధవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తో కలసి ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గృహ నిర్మాణ కార్యక్రమాలు, ప్రగతిలో ఉన్న గృహ నిర్మాణాల పురోగతి, భవిష్యత్ ప్రణాళికలు తదితర అంశాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు సమగ్రంగా సమీక్షించి పలు ఆదేశాలను జారీ చేయడం జరిగిందన్నారు.
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తదుపరి గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు 2.81 లక్షల గృహాలను పూర్తి చేయడం జరిగిందని, వచ్చే నెల 15 కల్లా 3.00 లక్షల గృహాలను పూర్తి చేసి ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభించాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. వీటితో పాటు పి.ఎం.ఏ.వై.-2 లో భాగంగా అర్బన్ లో మంజూరు చేయబడిన 40 వేల గృహాలకు మంజూరు ఉత్తర్వులు అందజేయడం జరుగుతుందన్నారు. వీటితో పాటు మరో 2.00 లక్షల గృహాలు అంటే గృహ నిర్మాణ శాఖకు చెందిన మరో లక్ష ఇళ్లు మరియు మరో లక్ష టిడ్కో గృహాలను సంక్రాతికల్లా అందజేయాలనే నిర్ణయాన్ని తీసుకోవడం జరిగిందన్నారు. ఇవి కాక పి.ఎం.ఏ.వై.-1.0 లో ఉన్న మరో 5 లక్షల గృహ నిర్మాణాలను రెండో సంవత్సరం పూర్తయ్యేలోపు పూర్తి చేయాలనే నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఈ విధంగా రెండేళ్ల కాలంలో దాదాపు 9.00 లక్షల గృహాలను పూర్తి చేసి లబ్దిదారులకు అందజేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు.
పి.ఎం.ఏ.వై.-2.0 నిబంధనలను కేంద్రం సవరించడం వల్ల ఇకపై కేవలం అర్బన్ (యు.ఎల్.బి.) ప్రాంతాల్లోనే ఈ పథకం క్రింద గృహాలను మంజూరు చేయడం జరుగుతుందని, అర్బన్ డవలెప్మెంట్ అథారిటీ పరిధిలోకి వచ్చే ప్రాంతాల్లో రూరల్ పథకం క్రింద గృహాలను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని అర్హులైన నిరుపేదలకు ఇంకా ఎన్ని గృహాలను నిర్మించాలనే అంశంపై గృహ నిర్మాణ శాఖ సర్వే చేయగా దాదాపు 6.00 లక్షల గృహాలు అవసరం అనే విషయాన్ని గుర్తించడం జరిగిందన్నారు. అయితే ఆర్.టి.జి.ఎస్. అంచనాలను కూడా పరిగణలోకి తీసుకుని ఖచ్చితంగా ఎన్ని గృహాలు నిర్మించాలనే విషయాన్ని అంచనావేసి రూరల్ హౌసింగ్ పథకం క్రింద గృహాలను నిర్మించాలని ముఖ్యమంత్రి అదేశించినట్లు మంత్రి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు నివాస స్థలం ఇచ్చే అంశంపై రెవిన్యూ శాఖ అధికారులతో కలసి సర్వేచేయనున్నామన్నారు.
ఎన్.టి.ఆర్. హౌసింగ్ పథకం క్రింద గత ప్రభుత్వం ఎటు వంటి బకాయిలు చెల్లించలేదని, వాటిని ఇప్పుడు చెల్లించాలని ఆర్థిక శాఖ అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. గత ప్రభుత్వం అనుసరించిన అవకతవకల ఆర్థిక విదానాల వల్ల దాదాపు రూ.3,000 కోట్ల కేంద్ర నిధులను డైవర్టు చేయడం జరిగిందని, అందులో దాదాపు రూ.900 కోట్లను ఇప్పటికే తమ ప్రభుత్వం గృహ నిర్మాణ శాఖకు విడుదల చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. హౌసింగ్ లేఅవుట్లలో ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. పథకం క్రింద మౌలిక వసతుల కల్పనకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. పి.ఎం.ఏ.వై. రూరల్ లో రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.87 కోట్లను ప్రభుత్వం విడుదల చేయనున్నదని, తద్వారా కేంద్రం నుండి రూ.350 కోట్లు వచ్చే అవకాశం ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల నిర్మాణంలో జరిగిన అవకతవకలపై ప్రత్యేకించి నెల్లూరు జిల్లాలో రాక్రీట్ సంస్థ పై విజిలెన్సు నివేదిక ప్రభుత్వానికి అందజేయడం జరిగిందని, ఆ నివేదిక ఆధారంగా ఆ సంస్థపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి తెలిపారు. అదే విధంగా ఆ సంస్థలు మధ్య వదిలేసి పోయిన దాదాపు 80 వేల గృహాలను కేంద్ర, రాష్ట్ర నిధులు దాదాపు రూ.800 కోట్లతో పూర్తి చేయడం జరుగుతుందన్నారు.

**డిశంబరు కల్లా మరో లక్ష టిడ్కో గృహ నిర్మాణాలు పూర్తి.....**

అనంతరం రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ డిశంబరు కల్లా మరో లక్ష టిడ్కో గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆదేశించినట్లు తెలిపారు. ఇప్పటికే టిడ్కో ప్రాజెక్టు క్రింద దాదాపు 83,072 ఇళ్లను పూర్తి చేయడం జరిగిందని, అయితే వీటిలో 2014-19 మధ్య కాలంలోనే దాదాపు 75 వేల ఇళ్లను పూర్తి చేయడం జరిగిందన్నారు. మిగిలినవి వచ్చే ఏడాది మార్చి 31 కల్లా పూర్తి చేయడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం టిడ్కో గృహాలను 2.61 లక్షలకు కుదించిందని, వాటిని ముందుగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి తెలిపారు. ఈ టిడ్కో ప్రాజెక్టు పూర్తి చేయడానికి దాదాపు రూ.6,500 కోట్ల మేర నిధులు కావాల్సి ఉందన్నారు.
2014-19 మధ్య కాలంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా టిడ్కో గృహ నిర్మాణాలను చేపట్టడం జరిగిందన్నారు. మూడు కేటగిరిల్లో దాదాపు 7.00 లక్షల గృహాలు నిర్మించేందుకు మంజూరు చేయడం జరిగిందన్నారు. వాటిలో 5.00 లక్షల గృహాలకు అడ్మినిస్ట్రేటివ్ అప్రూవల్ తీసుకోవడం జరిగిందన్నారు. వాటిలో 4.54 లక్షల గృహాలకు టెండర్లు పిలవలడం జరిగిందని, 3.13 లక్షల గృహాలు గ్రౌండ్ చేయడం జరిగిందన్నారు. అయితే గత ప్రభుత్వం ఆ గృహ నిర్మాణాలను పూర్తిగా నిర్వీర్యం చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం టిడ్కో గృహాల పై గృహ రుణాలు తీసుకుని ఇ.ఎం.ఐ.లు కట్టకపోవడం వల్ల లబ్దిదారులకు నోటీసులు రావడం జరుచున్నదన్నారు. ఇందుకై తమ ప్రభుత్వం రూ.140 కోట్లు ఇ.ఎం.ఐ. రూపేణా కట్టడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం దాదాపు రూ.4,282 కోట్లు బకాయిలను కాంట్రాక్టర్లకు చెల్లించలేదన్నారు.

## 'అగ్ని-5' మధ్యంతర శ్రేణి క్షిపణి పరీక్ష విజయవంతం



**ఒడిశా(జర్నలిస్ట్ ఫైల్):** భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) మరో కీలక విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. దేశీయంగా అభివృద్ధి చేసిన అణ్వస్త్ర సామర్థ్యం గల అగ్ని-5 బాలిస్టిక్ క్షిపణిని బుధవారం విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం నుంచి సాయంత్రం 7:30 గంటల సమయంలో ఈ ప్రయోగాన్ని నిర్వహించినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ క్షిపణి నిర్దేశిత లక్ష్యాన్ని అత్యంత కచ్చితత్వంతో ఛేదించి తన సత్తాను చాటింది.
సుమారు 5,000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను కూడా ఛేదించగల సామర్థ్యం అగ్ని-5 సొంతం. ఈ ప్రయోగ సమయంలో క్షిపణి పనితీరు, వేగం, ట్రాకింగ్ వ్యవస్థలు వంటి అన్ని సాంకేతిక అంశాలను శాస్త్రవేత్తలు క్షుణ్ణంగా పర్యవేక్షించారు. అనుకున్న విధంగానే క్షిపణి అన్ని ప్రమాణాలను విజయవంతంగా అందుకుందని అధికారులు ధ్రువీకరించారు. డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలు, సైనిక ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఈ పరీక్ష సజావుగా సాగింది.
భారత రక్షణ వ్యవస్థలో అగ్ని-5 క్షిపణి అత్యంత కీలకమైనదిగా పరిగణిస్తారు. ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి అయిన ఇది, అణ్వాయుధాలను మోసుకెళ్లే సామర్థ్యంతో దేశ రక్షణ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుంది. ఈ విజయవంతమైన పరీక్షతో రక్షణ సాంకేతికతలో స్వావలంబన దిశగా భారత్ మరో బలమైన అడుగు వేసినట్లయిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. తాజా విజయంపై డీఆర్‌డీఓ శాస్త్రవేత్తల బృందాన్ని పలువురు ఉన్నతాధికారులు అభినందించారు.

## కానిస్టేబుళ్ల ఎంపికైన వారు 23న సర్టిఫికెట్లతో హాజరు కావాలి


**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు జిల్లా పోలీసు పెరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో సివిల్, ఏపీఎస్పీ కానిస్టేబుళ్లుగా ఎంపికైన పురుషులు, మహిళలు ఈ నెల 23వ తేదీన ఉదయం 10 గంటలకు గుంటూరు జిల్లా పోలీసు కార్యాలయం వద్ద హాజరుకావాలని జిల్లా ఎస్పీ ఎస్. సతీశ్‌కుమార్ (ఐపీఎస్) ఒక ప్రకటనలో తెలిపారు.
అభ్యర్థులు తమ దరఖాస్తులో సమర్పించిన అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, గెజిటెడ్ అధికారితో అటెస్టేషన్ చేయించిన మూడు సెట్ల జిరాక్స్ ప్రతులు, నాలుగు పాస్‌పోర్టు సైజు కలర్ ఫోటోలు తీసుకురావాలని ఎస్పీ సూచించారు.

## ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం



**ఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్):** డబ్బులతో ముడిపడిన ఆన్‌లైన్ గేమింగ్ నిర్వహణను నిషేధించే కీలక బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. 'ది ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు-2025' పేరిట తీసుకొచ్చిన ఈ బిల్లును కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. మూజువాణి ఓటుతో ఈ బిల్లు ఆమోదం పొందింది. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లకు కొంతమంది బానిస కావడం, మనీలాండరింగ్, ఆర్థిక మోసాల వంటివి ఇటీవల కాలంలో పెరిగిపోయిన నేపథ్యంలో కేంద్రం ఈ బిల్లును ప్రవేశపెట్టింది.
ఆన్‌లైన్ గేమ్స్, ఈ-స్పోర్ట్స్ మధ్య విభజన చూపించేలా బిల్లును రూపొందించారు. నిబంధనల్ని ఉల్లంఘించి ఆన్‌లైన్ గేమ్స్ అందిస్తున్న వారికి మూడేళ్ల వరకు జైలుశిక్ష, లేదా రూ.కోటి వరకు జరిమానా, లేదా ఆ రెండూ విధించాలని ప్రతిపాదించారు. సంబంధిత అడ్వర్టయిజ్‌మెంట్లలో భాగం పంచుకున్నవారికి గరిష్ఠంగా రెండేళ్ల జైలుశిక్ష, రూ.50 లక్షల వరకు జరిమానా విధిస్తారు. వీటి ఆర్థిక లావాదేవీల్లో ప్రమేయం ఉన్నవారికీ గరిష్ఠంగా మూడేళ్ల శిక్ష, రూ.కోటి వరకు జరిమానా వేస్తారు. ఆన్‌లైన్ మనీ గేమ్స్ ఆడేవారిని నేరస్థులుగా కాకుండా.. బాధితులుగా ఈ బిల్లులో పేర్కొన్నారు. మరోవైపు.. ఈ బిల్లు కారణంగా తమ రంగానికి తీవ్ర నష్టం కలుగుతుందని ఆల్ ఇండియా గేమింగ్ ఫెడరేషన్ కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు లేఖ రాసింది. గేమింగ్‌పై నిషేధం విధించే కంటే.. నియంత్రణ ఉంచాలని సూచించింది.

## అలాస్కా వ్యక్తికి 'పుతిన్' గిఫ్ట్!



**రష్యా:** రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇటీవల అలాస్కాలో ట్రంప్‌తో భేటీ అయిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఓ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. అలాస్కాకు చెందిన ఓ వ్యక్తికి రూ.19 లక్షల విలువైన బైక్‌ను పుతిన్ బహుమతిగా ఇచ్చారు. రష్యాలో తయారైన యూరల్ బైక్‌ను అతడు వాడుతుండటమే అందుకు కారణం. ఈ ఊహించని పరిణామానికి అలాస్కా వ్యక్తి ఆనందంతో మునిగిపోయాడు.
అలాస్కా వేదికగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌ల భేటీ జరిగింది. అంతకు ఓ వారం ముందే యాంకరేజ్‌కు చేరుకున్న రష్యన్ మీడియా ప్రతినిధులు స్థానికులతో ముచ్చటించే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో యూరల్ కంపెనీకి చెందిన ఓ పాత బైక్ వాడుతున్న మార్క్ వారెన్ (%మీుతీని ఔుతీతీవఅ%) అనే రిటైర్డ్ ఫైర్ ఇన్‌స్పెక్టర్ రష్యా జర్నలిస్టుల కంటపడ్డాడు. ఈ బైక్ అంటే చాలా ఇష్టమని చెప్పిన వారెన్.. యుద్ధం నేపథ్యంలో ఆ బైక్ విడిభాగాలు దొరకట్లేదని, నిర్వహణ కష్టంగా మారిందని వాపోయాడు. ట్రంప్-పుతిన్ భేటీ వల్ల ఈ యుద్ధానికి ముగింపు లభిస్తే ప్రయోజనం ఉంటుందా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు అవునంటూ సమాధానమిచ్చాడు.
ఇందుకు సంబంధించిన న్యూస్ రష్యాలో వైరల్‌గా మారింది. క్రెమ్లిన్ దృష్టికీ వెళ్లింది. దీంతో స్పందించిన రష్యా అధికారులు వారెన్‌కు ఫోన్ చేసి బైక్ గురించి ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. పుతిన్ వచ్చిన విమానంలోనే ఆ బైక్‌ను తీసుకొచ్చిన అధికారులు.. అమెరికా అధికారుల సాయంతో స్థానిక ఎంబసీకి తరలించారు. భేటీ మరుసటి రోజు దీనిని వారెన్‌కు అప్పగించే ఏర్పాట్లు చేశారు. సతీమణితో రష్యా ఎంబసీకి వెళ్లిన వారెన్‌కు.. రష్యా అధ్యక్షుడు మీకు ఇచ్చిన బహుమానం ఇదేనని బైక్‌ను చూపించడంతో ఆనందంలో మునిగిపోయాడు.

## కేంద్ర హెూంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ సిఎస్,డిజిపిలతో వీడియో సమావేశం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** నూతన క్రిమినల్ చట్టాల పటిష్ట అమలుకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం కేంద్ర హెూం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ ఢిల్లీ నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మరియు డిజిపి హరీశ్ కుమార్ గుప్తాలతో వీడియో సమావేశం నిర్వహించారు. మన దేశంలో కొత్త క్రిమినల్ చట్టాలు అనగా భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత మరియు భారతీయ సాక్ష్య అధినియం అనే చట్టాలు పాత క్రిమినల్ చట్టాలైన ఇండియన్ పీనల్ కోడ్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, మరియు ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ ల స్థానే అమలులోకి వచ్చాయి. ఈనూతన క్రమినల్ చట్టాలను క్షేత్ర స్థాయిలో పటిష్టవంతంగా అమలు చేసేందుకు వివిధ పోలీస్ స్టేషన్లు, కోర్టులు, జైళ్ళు, ఫోరెన్సిక్ లేబరేటరీల్లో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, సాంకేతిక పరిజ్ఞానం తదితర అంశాలపై ఆయన చర్చించారు. ఈసందర్భంగా హెూంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ మాట్లాడుతూ ఫోరెన్సిక్ ఇకో సిస్టమ్ ను పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని దానిలో భాగంగా ప్రస్తుతం ఉన్న ఫోరెన్సిక్ సైన్స్ లేబరేటరీలను మరింత పటిష్టం వంతం చేయాలని ఆదిశగా తగిన చర్యలు తీసుకోవాలని సిఎస్, డిజిపిలకు సూచించారు. వాటిలో వివిధ ఖాళీలను భర్తీ చేసేందుకు అర్హులైన వారిని కాంట్రాక్టు విధానంలో భర్తీ చేయాలని చెప్పారు. నూతన క్రమినల్ చట్టాల అమలులో ఏపి దేశానికి రోల్ మోడల్ గా ఉండే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సిఎస్,డిజిపిలకు సూచించారు. నేరం జరిగిన ప్రాంతాల్లో అనగా సీన్ ఆఫ్ అఫెన్స్ లో పూర్తిగా ఆడియో వీడియో చిత్రీకరణ చేయాలని, అన్ని ఎఫ్ఐఆర్లను ఇ-సాక్ష్యంలో పొందుపర్చాలని డిజిపికి హెూంశాఖ కార్యదర్శికి గోవింద్ మోహన్ సూచించారు.
నూతన క్రిమినల్ చట్టాల పటిష్ట అమలుకు సంబంధించి కోర్టు రూములు, జైళ్ళు, ఫోరన్సిక్ సైన్స్ లేబొరేటరీలు, ప్రభుత్వ కార్యాలయాల, బ్యాంకులు తదితర చోట్ల వీడియో కాన్ఫరెన్సింగ్ విధానం అందుబాటులో ఉండేలా చూడాలని కేంద్ర హెూంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ సిఎస్,డిజిపిలకు సూచించారు. అలాగే ట్రైనింగ్ అండ్ కెపాసిటీ బిల్డింగ్, జీరో ఎఫ్ఐఆర్, ఇ-ఎఫ్ఐఆర్, మానిటం రింగ్ ఆఫ్ ఆర్గనైజ్డ్ క్రైమ్, వివిధ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీల ఆధునికీ కరణ, తగిన సిబ్బంది ఏర్పాటు, సిటిజన్ సెంట్రిక్ ప్రొవిజన్స్ అయిన ఎస్ఎంఎస్, ఇ-మెయిల్ సేవలను సిసిటిఎన్స్తో ఇంటిగ్రేషన్, ఫిర్యాదుదారులకు ఎస్ఎంఎస్ అలెర్టులు పంపించడం వంటి అంశాల్లో ఏపి పోలీసులు చేపట్టిన ఏపి పోలీస్ సేవా, సిటిజన్ పోర్టల్, శక్తి యాప్ వంటి వినూతన్న చర్యలను హెూంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ ప్రశంసించారు.
అంతకు ముందు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మాట్లాడుతూ కలక్టరేట్లు సహా డివిజన్, మండల స్థాయి ప్రభుత్వ కార్యాలయాల్లో వీడియో కాన్ఫరెన్సింగ్ విధానం ఇప్పటికే అందుబాటులో ఉందని చెప్పారు. డిజిపి హరీశ్ కుమార్ గుప్త మాట్లాడుతూ సీన్ ఆఫ్ అఫెన్స్ ప్రాంతాల్లో నూరు శాతం ఆడియో, వీడియో చిత్రీకరణకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. అదే విధంగా అన్ని ఎఫ్ఐఆర్లను ఇ-సాక్ష్యంలో నమోదుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈవీడియో సమావేశంలో జైళ్ళశాఖ డిజి అంజనీ కుమార్, శాంతి భద్రతల అదనపు డిజి ఎన్.మధుసూదన్ రెడ్డి, జైళ్ళశాఖ డిఐజి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## భారత్ విషయంలో అమెరికా తీరు అన్యాయం: రష్యా



**అమెరికా :** తమ దేశం నుంచి చమురు కొనుగోలు అంశంలో భారత్‌పై అమెరికా వైఖరి అన్యాయంగా ఉందని రష్యా ఆరోపించింది. ఈమేరకు ఆ దేశ దౌత్యవేత్త రోమన్ బబుష్కిన్ పేర్కొన్నారు. భారత్-రష్యా మధ్య ఇంధన సహకారం భవిష్యత్తులోను కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రస్తుతం న్యూదిల్లీ సవాళ్లతో కూడిన పరిస్థితిని ఎదుర్కొంటోందన్నారు. భారత్‌తో సంబంధాలపై పూర్తి విశ్వాసం ఉందని పేర్కొన్నారు. అమెరికా ఆర్థికవ్యవస్థలను ఆయుధంలా వాడుతోందని విమర్శించారు. వాస్తవానికి మిత్రులు ఎప్పుడూ ఆంక్షలు విధించరని వాషింగ్టన్‌ను దెప్పిపొడిచారు. రష్యా భవిష్యత్తులోను భారత్ అలాంటి చర్యలు తీసుకోదన్నారు. భారత్‌కు ఎటువంటి ఇబ్బందిలేకుండా చమురు సరఫరా చేసేందుకు మాస్కో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటుచేసిందన్నారు. ప్రస్తుతం సగటున 5 శాతం డిస్కౌంట్‌తో భారత్ అవసరాల్లో 40శాతం సరఫరా చేస్తున్నామన్నారు. అమెరికా మార్కెట్లకు ఎగుమతి చేసేందుకు భారత్ ఇబ్బంది పడుతుంటే.. రష్యా మార్కెట్లు స్వాగతం పలుకుతాయని చెప్పారు.
భారత్ ఎదుర్కొంటున్న సవాళ్ల పరిష్కారంలో అండగా ఉండటానికి తమ దేశం కట్టుబడి ఉందని రోమన్ వెల్లడించారు. చిన్న, మాడ్యులర్ అణు రియాక్టర్లపై చర్చలు పురోగతిలో ఉన్నట్లు చెప్పారు. భారత్‌లో ఉత్పత్తులు చేయడానికి న్యూదిల్లీకి సరైన భాగస్వామి రష్యానే అని పేర్కొన్నారు. గతంలో బ్రహ్మోస్ క్షిపణుల తయారీని గుర్తుచేశారు. శక్తిమంతమైన జెట్ ఇంజిన్ల తయారీపైనా పనిచేస్తున్నట్లు చెప్పారు. భారత్ తమకు చాలా ముఖ్యమైన దేశమని.. అందుకే అధ్యక్షుడు పుతిన్ స్వల్ప వ్యవధిలోనే రెండుసార్లు ప్రధాని మోదీతో మాట్లాడారన్నారు. సమస్యల పరిష్కారంపై బీజింగ్-న్యూదిల్లీ కలిసి పని చేయడాన్ని స్వాగతించారు. చైనా మంత్రి వాంగ్‌యీ పర్యటన విజయవంతమైందన్నారు.
**ఆగని చమురు మంటలు: ట్రంప్ కార్యవర్గం పదేపదే టార్గెట్ భారత్..! :** ఇక రష్యాను శిక్షించేందుకు ఆంక్షలు విధించినవారే ఇప్పుడు ఆ ఫలితాలను అనుభవిస్తున్నారని రోమన్ చెప్పారు. ప్రస్తుతం ప్రపంచ రాజకీయాల్లో కుదుపులు నెలకొన్న నేపథ్యంలో వాటిని స్థిరీకరించే శక్తిగా బ్రిక్స్ ఉంటుందని రోమన్ వెల్లడించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై సుంకాలను రెట్టింపు చేసి 50శాతానికి చేర్చిన నేపథ్యంలో రష్యా నుంచి స్పందన వెలువడటం గమనార్హం. మరికొన్ని రోజుల్లో అవి పూర్తిస్థాయిలో అమల్లోకి రానున్నాయి.

## ఏఐ ద్వారా భక్తులకు శ్రీవారి దర్శనం

**హైదరాబాద్:** ఏఐ ద్వారా భక్తులకు 1-2 గంటల్లో శ్రీవారి దర్శనానికి చర్యలు తీసుకుంటున్నామని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తితిదేలో పనిచేసే అన్యమత సిబ్బందిని మరో విభాగానికి బదిలీ చేసేందుకు, వాలంటరీ రిటైర్‌మెంట్ స్కీమ్ కింద పంపేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అన్యమత ప్రచారంలో పాల్గొంటే సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.
"సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఒంటిమిట్టలో అన్నదాన కార్యక్రమం నిరంతరం కొనసాగుతోంది. తితిదే నుంచి ఒంటిమిట్టలో అన్నదానం కోసం రూ.4కోట్లు కేటాయించాం. గత పాలనలో 12 మంది వైకాపా వర్గీయులకు తిరుమలలో హెూటళ్లు ఇచ్చారు. గతంలో హెూటళ్ల కేటాయింపు మాఫియాలా తయారైంది. ప్రస్తుతం ఈ- టెండర్ల ద్వారా హెూటళ్లు కేటాయించాం. తిరుమలలో త్వరలో కొత్త క్యాంటీన్లు ప్రారంభిస్తాం. శ్రీవాణి దర్శన సమయాల వేళలు మారుస్తాం. ఉదయం టికెట్లు తీసుకుని సాయంత్రం దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం.
శ్రీవారి దర్శనాలు, ప్రసాదాల విషయంలో సైబర్ మోసాలు జరుగుతున్నాయి. వాటిని అరికట్టేందుకు సైబర్ సెక్యూరిటీ ల్యాబ్ ఏర్పాటు చేయాలని యోచిస్తున్నాం. ఏడాది కాలంలో 30వేల నకిలీ వెబ్‌సైట్లను క్రాష్ చేశాం. భద్రతా చర్యల్లో భాగంగా అలిపిరిలో స్కానర్లు అప్‌డేట్ చేస్తున్నాం. గతంలో వీఐపీ దర్శనం ఉదయం 10 గంటలకు ఉండటంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వీఐపీ దర్శనాలు ఉదయం 8 నుంచి 8.30గంటలకు ముగించేలా చర్యలు తీసుకుంటున్నాం. బర్డ్ ఆసుపత్రి విస్తరణపై దృష్టి సారించాం" అని తితిదే ఛైర్మన్ తెలిపారు.

# ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ దిశగా వేగంగా అడుగులు



**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో దేశంలోనే ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను ఉత్తమంగా తీర్చిదిద్ది ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ గురించి అందరూ మాట్లాడుకునే విధంగా చేస్తామనే విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సంకల్పానికి కేంద్రం కూడా మద్దతుగా నిలుస్తోంది. సమగ్రశిక్షకు గతంలో కంటే అదనంగా రూ.432.19 కోట్ల నిధులను కేంద్రం మంజూరు చేసింది. దేశానికే ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ దిక్సూచిగా మారాలనే లక్ష్యంతో పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష వినూత్నమైన కార్యక్రమాలతో, విద్యలో నాణ్యతా ప్రమాణాలు పెంచే విధంగా అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఆంధ్రప్రదేశ్ సమగ్రశిక్షకు కేంద్రం నుంచి నిధులు మంజూరు అయ్యాయి. మంత్రి లోకేష్ చొరవతో నిధుల కేటాయింపు విషయంలో రాష్ట్రానికి కేంద్రం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. మంత్రి లోకేష్ కృషి కారణంగా సమగ్ర శిక్ష, పాఠశాల విద్యాశాఖకు వరుసగా కేంద్ర ప్రభుత్వం నుంచి అదనపు నిధులు మంజూరయ్యాయి.

**ఐసీటీ ల్యాబ్ లు, స్మార్ట్ క్లాసెస్ కు రూ.167.46 కోట్ల అదనపు నిధులు మంజూరు :**

సెకండరీ, సీనియర్ సెకండరీ పాఠశాలల్లో విద్యార్థులను బలోపేతం చేయడానికి ఐసిటి (Information and Communication Technology) ల్యాబ్ లు, స్మార్ట్ తరగతులు, సైన్స్ ల్యాబ్స్ ఏర్పాటుచేసేందుకు కేంద్రం రూ.167.46 కోట్ల అదనపు నిధులను మంజూరు చేయడం జరిగింది. దీంతో పాటు డైట్ కళాశాలలను సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ గా మార్చడానికి గతంలో 50 శాతం మాత్రమే నిధులు రాగా, ఈ ఏడాది రూ.45 కోట్లకు గానూ 96శాతం అంటే రూ.43.23 కోట్ల నిధులు మంజూరు చేసింది. దశల వారీగా ఇతర డైట్ కళాశాలలను సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ గా మార్చేందుకు తగిన నిధులు మంజూరు చేయనుంది. ధర్తి ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ పథకంలో భాగంగా రాష్ట్రంలో ఉన్న ఆదివాసీ విద్యార్థుల కోసం 4 వసతి గృహాలను నిర్మించేందుకు కేంద్రం రూ.11 కోట్లు నిధులు మంజూరు చేసింది. ధర్తి ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ పథకం అనేది గిరిజన తెగల సామాజిక, ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక కార్యక్రమం. 2024-25 నుంచి 2028-29 వరకు ఐదేళ్ల కాలానికి ఈ పథకం అమలు చేయనున్నారు. గిరిజన మెజారిటీ గ్రామాలన్నింటిలోనూ సంపూర్ణ అభివృద్ధిని సాధించడం, వారికి మెరుగైన మౌలిక వసతులు, విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలను కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యం.

**జనజాతీయ ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకం కింద రూ.210.5 కోట్లు మంజూరు :**

ప్రధాన మంత్రి జనజాతీయ ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకంలో భాగంగా రెండు దశల్లో మొత్తం 79 హాస్టళ్లు నిర్మించేందుకు కేంద్రం రూ.210.5 కోట్ల నిధులు మంజూరు చేసింది. గత ఏడాది నాలుగు హాస్టళ్లు మాత్రమే మంజూరు కాగా.. ఈ ఏడాది అత్యధికంగా 79 హాస్టళ్లు ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపి ఈ మేరకు నిధులు కేటాయించింది.

**మంత్రి లోకేష్ చొరవతో పీఎంశ్రీ కింద అదనంగా 80 పాఠశాలలు ఎంపిక :**

ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా పథక కింద రాష్ట్రంలో ఈ ఏడాదికి మొత్తం 80 పాఠశాలలను కేంద్రం ఎంపిక చేసింది. వీటికి ఇంకా నిధులు కేటాయించాల్సి ఉంది. రాష్ట్రంలో మొదటి దశలో 662 పీఎంశ్రీ పాఠశాలలు, రెండో దశలో 193 కలిపి మొత్తం 855 పాఠశాలలను పీఎంశ్రీ కింద ఎంపిక చేయగా.. మంత్రి నారా లోకేష్ చొరవతో ఈ విద్యా సంవత్సరం అదనంగా మరో 80 పీఎంశ్రీ పాఠశాలలను రాష్ట్రానికి కేంద్రం మంజూరు చేసింది.
దేశవ్యాప్తంగా 14,500 పీఎంశ్రీ పాఠశాలలు ఉండగా.. అత్యధికంగా ఏపీకే 935 పీఎంశ్రీ పాఠశాలలను కేటాయించడం జరిగింది. మొత్తం మీద మంత్రి నారా లోకేష్ కృషి కారణంగా సమగ్రశిక్ష కింద రాష్ట్రానికి అదనంగా రూ.432.19 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది.

# 6 వేల విద్యార్థి వీసాలు రద్దు!



## అమెరికా ప్రభుత్వం తాజా నిర్ణయం

### నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు: ట్రంప్

**వాషింగ్టన్, ఆగస్టు 20:** అమెరికాలో నిబంధనలు ఉల్లంఘించిన విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకొంటున్నారు. తాజాగా 6,000 మంది అంతర్జాతీయ విద్యార్థుల వీసాలను రద్దు చేసినట్లు బిబిసి రిపోర్టులో పేర్కొంది. అమెరికా విదేశాంగ శాఖ ఈ విషయాన్ని వెల్లడించినట్లు తెలిపింది. 4,000 మంది దేశ చట్టాలు ఉల్లంఘించడం, దాడులు, మత్తులో డ్రైవింగ్, దోపిడీలకు పాల్పడటం వంటివి చేసినట్లు తెలుస్తోంది. అమెరికా చట్టాల్లోని ఐఎన్ఎ 3బి కింద ఉగ్రవాదానికి పాల్పడిన దాదాపు 300 మంది కూడా ఈ జాబితాలో ఉన్నారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభంలో ఈ వీసాల రద్దు వ్యవహారం వెలుగులోని రావడం గమనార్హం.

ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించాక దేశంలో ఉన్నత విద్యా వ్యవస్థను పునర్ వ్యవస్థీకరించే పనిలో పడ్డారు. ప్రధాన విశ్వవిద్యాయాలను లక్ష్యంగా చేసుకొని తీవ్రస్థాయిలో పాలసీల మార్పులు చేపట్టారు. ఇవి అంతర్జాతీయ విద్యార్థులపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. తొలుత జనవరిలో యాంటీ సెమిటిజమ్‌ను (యూదులపై వ్యతిరేకత) అరికట్టేలా బిల్లును పాస్‌చేశారు. అంతర్జాతీయ విద్యార్థులు పాలస్తీనాకు మద్దతుగా ఆందోళనలు చేపడితే ఈ ఆదేశాల ప్రకారం వారిని దేశ బహిష్కరణ చేయవచ్చు.

విదేశీ విద్యార్థులకు కొత్త ఇంటర్వ్యూల షెడ్యూల్‌ను నిలిపివేస్తూ జూన్‌లో ట్రంప్ కార్యవర్గం నిర్ణయం తీసుకొంది. అనంతరం సోషల్ మీడియా వెట్టింగ్‌ను కఠినతరం చేశారు. ఫారెన్ స్టూడెంట్స్ కచ్చితంగా వారి సామాజిక మాధ్యమ ఖాతాలు బహిర్గతం చేయాలని ఆదేశించారు. విద్యార్థుల పోస్టులు, కామెంట్లు, లైక్‌లను అమెరికా అధికారులు పరిశీలించి.. వారు జాతీయ భద్రతకు ముప్పు కాదు అని భావిస్తే మాత్రమే వీసా ప్రక్రియలో ముందుకువెళతారు. ఇక కీలక విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలకు కేటాయించిన నిధుల్లో కోత విధించారు. క్యాంపస్‌ల్లో పాలస్తీనా అనుకూల ఆందోళనల్లో పాల్గొన్న చాలామంది విదేశీ విద్యార్థులను అరెస్టు చేయించారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయం అంతర్జాతీయ విద్యార్థులను నియమించుకోకుండా బ్లాక్ చేశారు. ఈ క్రమంలో ట్రంప్ కార్యవర్గం, విశ్వవిద్యాలయం మధ్య న్యాయపోరాటం మొదలైంది.

గతేడాది గణాంకాల ప్రకారం.. దాదాపు 10 లక్షల మందికిపైగా అంతర్జాతీయ విద్యార్థులు అమెరికాలో చదువుతున్నారు. వారి నుంచి దాదాపు 43.8 బిలియన్ డాలర్లు అమెరికాకు లభించాయని ఎన్ఎఎఫ్ఎస్ఎ అసోసియేషన్ వెల్లడించింది. దేశంలోని మొత్తం విద్యార్థుల్లో వీరు 6 శాతం వరకు ఉంటారు.



## యుఎస్-ద.కొరియా సైనిక విన్యాసాలు

### ఉత్తర కొరియా నియంత కిమ్ కన్నెర్ర

**ప్యాంగ్‌యాంగ్, ఆగస్టు 20:** అమెరికా, దక్షిణ కొరియా సైనిక విన్యాసాలపై ఉత్తర కొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్ మళ్లీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తమ అణ్వాయుధ దళాన్ని విస్తృతం చేస్తానని వ్యాఖ్యానించారు. అణ్వాయుధ సామర్థ్యం కలిగిన అధునాతన యుద్ధనౌకను పరిశీలించిన కిమ్. ప్రత్యర్థుల సైనిక విన్యాసాలు శత్రుత్వాన్ని పెంచేవేనని అన్నారు. అమెరికా, ద.కొరియా చేపడుతున్న సైనిక కసరత్తులను దండయాత్రకు సన్నాహాలుగా వాదిస్తున్న కిమ్.. తన సైనిక, అణ్వాయుధ కార్యక్రమాలను సమర్థించుకుంటున్నారు. ఈ క్రమంలోనే అణుసామర్థ్యం కలిగిన చోహ్యోన్ అనే యుద్ధనౌకను తాజాగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్యర్థుల సైనిక కసరత్తులు శత్రుత్వాన్ని ప్రదర్శిస్తున్నాయని, యుద్ధాన్ని ప్రేరేపించేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవి మునుపటి కంటే ఎక్కువ ఉద్రిక్తతలు పెంచేవిగా ఉన్నాయని, వాటికి దీటుగా ప్రతిస్పందించేందుకు తాము కూడా సిద్ధంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు.

'ఉ. కొరియా చుట్టూ భద్రతా పరిస్థితులు రోజురోజుకు మరింత ఉద్రిక్తంగా మారుతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఇప్పటికే ఉన్న సైనిక, అణు సామర్థ్యాలను వేగంగా మరింత విస్తరించుకోవాల్సిన అవసరం ఉంది' అని కిమ్ పేర్కొన్నట్లు ఉత్తరకొరియా అధికార వార్తా సంస్థ కెసిఎన్ఎ వెల్లడించింది. ఉత్తర కొరియా నుంచి పొంచి వున్న ముప్పును ఎదుర్కొనేందుకు సన్నద్ధమవుతున్న అమెరికా, దక్షిణ కొరియా బలగాలు.. వార్షిక సైనిక విన్యాసాలను భారీ స్థాయిలో నిర్వహిస్తున్నాయి. 11 రోజులపాటు కొనసాగే ఈకసరత్తుల్లో సియోల్‌కు చెందిన 18 వేల మందితో సహా మొత్తం 21వేల మంది సైనికులు పాల్గొంటున్నారు. క్షేత్రస్థాయి శిక్షణ, కంప్యూటర్ సిమ్యులేటెడ్ కమాండ్ పోస్టుతో పాటు ఆయుధ పరీక్షలు కూడా నిర్వహించనున్నారు.

## కాంగోలో ఊచకోత

### 52 మందిని నరికేసిన రెబల్స్

**కిన్‌షాస, ఆగస్టు 20:** ఆఫ్రికా దేశమైన కాంగోలో ఇస్లామిక్ స్టేట్ మద్దతు కలిగిన తిరుగుబాటు దారులు రెచ్చిపోయారు. కత్తులు, గొడ్డళ్లతో 52 మందిని నరికి చంపారు. ఈ విషయాన్ని స్థానిక అధికారులు తెలిపారు. కాంగో దళాల చేతిలో ఓటమి పాలవడంతో రగిలిపోయిన అలైట్ డెమోక్రటిక్ ఫోర్సెస్ (ఏడిఎఫ్) సభ్యులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారని అక్కడి అధికారి తెలిపారు. బెని, లుబెరో ప్రాంతాల్లోని పౌరులపై ఏడిఎఫ్ తిరుగుబాటుదారులు దాడికి పాల్పడినట్లు వెల్లడించారు. నిద్రపోతున్న ప్రజలను లేపి.. తాళ్లతో చేతులు కట్టి కత్తులు, గొడ్డళ్లతో అతికిరాతకంగా నరికి చంపారన్నారు. మెలియా గ్రామంలోనే దాదాపు 30 మంది ప్రాణాలు తీశారన్నారు. ఎనిమిది మంది మహిళలు, ఇద్దరు చిన్నారులతోసహా మొత్తం 52 మంది ప్రాణాలు కోల్పోయినట్లు వివరించారు. ఇళ్లకు కూడా నిప్పంటించారని, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఇటీవల ఓ కాథ్యలిక్ చర్చి ప్రాంగణంలో తిరుగుబాటు దారులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 38 మంది ప్రాణాలుకోల్పోయారు. ఇస్లామిక్ స్టేట్‌తో ముడిపడి ఉన్న తిరుగుబాటు సంస్థ ఏడిఎఫ్. ఈ సంస్థ ఉగాండా, డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో సరిహద్దు ప్రాంతాల్లో కార్యకలాపాలను నిర్వహిస్తోంది. పౌరులే లక్ష్యంగా కొన్నేళ్లుగా దాడులకు పాల్పడుతోంది. 2013నుంచి ఇప్పటి వరకు దాదాపు ఆరు వేల మందికిపైగా బలిగొన్నట్లు నివేదికలుఉన్నాయి. ఏడిఎఫ్‌పై అమెరికా, ఐరాస భద్రతామండలిలు ఆంక్షలు విధించాయి.

## అభిప్రాయం చెప్తాం.. తీర్పు ఇవ్వం



### తమిళనాడు కేసుపై స్పష్టం చేసిన సిజెఐ

**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** తమిళనాడు కేసుపై తమ బెంచ్ అభిప్రాయం వెల్లడిస్తుందే కానీ తీర్పు ఇవ్వదని సుప్రీంకోర్టు సిజెఐ బిఆర్ గవాయ్ పేర్కొన్నారు. రాష్ట్రాల శాసనసభలు ఆమోదించిన బిల్లులను రాష్ట్రపతి నిర్దిష్ట గడువులోగా తేల్చాలని కోర్టులు నిర్దేశించవచ్చా అన్న అంశంపై సుప్రీంకోర్టు విచారణ ప్రారంభించింది. తొలుత ఈ పిటిషన్‌ను విచారణకు చేపట్టడంపై ఉన్న అర్హతలను వింటామని చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా బిఆర్ గవాయ్ వెల్లడించారు. దీనిపై సీనియర్ న్యాయవాది కెకె వేణుగోపాల్ మాట్లాడుతూ ఈ అంశంలో చాలా విషయాలు ఉన్నాయని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 200ను చూడాలని పేర్కొన్నారు. పంజాబ్, తమిళనాడు, తెలంగాణ కేసుల్లో వీలైనంత త్వరగా అన్న పదంవల్ల జాప్యం చోటుచేసుకొందన్నారు. తమిళనాడు కేసు వల్ల ఇప్పుడుగడువు విధించారని వెల్లడించారు. దీనిపై సిజెఐ స్పందిస్తూ స్వయంగా రాష్ట్రపతి దీనిపై రిఫరెన్స్ అడిగారు. దీనిలో మీకున్న సమస్య ఏమిటని ఆయన ప్రశ్నించారు. మరోవైపు అటార్నీ జనరల్ వెంకటరమణి స్పందిస్తూ తాము రాజ్యాంగ ధర్మాసనం పరిశీలన కోరతున్నామని చెప్పారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ వాదనలు కూడా విన్న సిజెఐ గవాయ్ స్పందిస్తూ తాము కేవలం అభిప్రాయాలు మాత్రమే చెబుతామని తమిళనాడు కేసుపై తీర్పు మాత్రం ఇవ్వమని పేర్కొన్నారు. మరో న్యాయమూర్తి జస్టిస్ పిఎస్ నరసింహా కూడా తమబెంచ్ కేవలం అభిప్రాయం మాత్రమే వెల్లడిస్తుందని, అది తమిళనాడు కేసు జడ్జిమెంట్‌పై ఎలాంటి ప్రభావం చూపదని పేర్కొన్నారు.

తమిళనాడు శాసనసభ ఆమోదించిన 10 బిల్లులను ఆ రాష్ట్ర గవర్నరు ఆర్ఎన్‌రవి ఆమోదించకుండా తన వద్దే ఉంచుకోవడం సరికాదని ఈ యేడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రాష్ట్రాలు పంపే బిల్లులను రాష్ట్రపతి, గవర్నర్ గరిష్టంగా మూడు నెలల్లోగా ఆమోదించడమో, తిప్పి పంపించడమో చేయాలని నిర్దేశించింది. ఈతీర్పు తర్వాత కూడా గవర్నర్లు బిల్లులపై జాప్యం చేస్తుంటే సర్వోన్నత న్యాయస్థానాన్ని నేరుగా ఆశ్రయించవచ్చని, గవర్నర్ల నిష్క్రియాపరత్వం న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుందని స్పష్టం చేసింది. రాజ్యాంగ అధికరణం 142 ద్వారా అటువంటి సంపూర్ణ అధికారం సుప్రీంకోర్టు ఉందని జస్టిస్ జెబిపార్థీవాలా, జస్టిస్ ఆర్. మహదేవన్ ధర్మాసనం తేల్చి చెప్పింది.

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ అంశంలో గవర్నర్‌తో పాటు రాష్ట్రపతికీ గడువు విధించడంపై భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పందిస్తూ రాజ్యాంగంలో అలాంటి నిబంధనేదీ లేనప్పుడు సుప్రీంకోర్టు తీర్పు ఎలా ఇచ్చిందని ప్రశ్నించారు. అనంతరం దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం గడువు విధించడంపై అభిప్రాయాలు తెలియచేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది. ఇప్పటికే దీనిపై కేంద్రం స్పందించింది. ఒక రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లులపై చర్యలు తీసుకోవడానికి రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించడం రాజ్యాంగపరమైన గందరగోళానికి దారి తీస్తుందని సుప్రీంకోర్టుకు తెలియచేసింది. అలాచేయడం ప్రభుత్వం తనకు రాజ్యాంగం ఇవ్వని అధికారాన్ని అందిపుచ్చుకుని చెల్లాయించినట్లువుతుందని పేర్కొంది.

## నెలాఖరులో ప్రధాని చైనా పర్యటన: దోవల్

**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ నెలలో చైనాలో పర్యటించనున్నట్లు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ వెల్లడించారు. భారత్ పర్యటనలో ఉన్న చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో భేటీ సందర్భంగా దోవల్ ఈ విషయాన్ని ధృవీకరించారు. తియాంజిన్ నగరంలో ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో జరగనున్న షాంఘై సహకార సంస్థ సదస్సులో ప్రధాని మోడీ పాల్గొననున్నారని చెప్పారు. చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యీతో 24వ ప్రత్యేక ప్రతినిధుల స్థాయి చర్చలు ఢిల్లీలో జరిగాయి. ఈ సందర్భంగా అజిత్ దోడల్ మాట్లాడుతూ గడిచిన తొమ్మిది నెలల్లో సరిహద్దుల్లో పరిస్థితులు మెరుగుపడ్డాయని, ప్రస్తుతం అక్కడ ప్రశాంత వాతావరణం కొనసాగుతుందన్నారు. తాజా ద్వైపాక్షిక చర్చలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్న ఆయన ఇరు దేశాధినేతలు కజాన్‌లో భేటీకావడం ఉద్రిక్తతలను తగ్గించిందన్నారు. చైనాలోజరిగే ఎస్‌సిఒసదస్సుకు ప్రధాని మోడీ హాజరవుతున్నారని అధికారికంగా ప్రకటించారు. వాంగ్ యీ మాట్లాడుతూ కొన్ని ఏళ్లుగా మనం ఎదుర్కొంటున్న సవాళ్లు మన ప్రయోజనాలకు అనుగుణంగా లేవు. మోడీ, జిన్‌పింగ్‌లు కజాన్‌లో భేటీ కావడం, ఆ తర్వాత సరిహద్దులోనూ పరిస్థితులు స్థిరంగాఉండటం సంతోషకరమైన విషయం. ఎస్‌సిఒ సదస్సుకు ప్రధాని మోడీ రాకను స్వాగతిస్తున్నాం. భారత్, చైనాల మధ్య ఆరోగ్యకరమైన సంబంధాలు దీర్ఘకాలిక ప్రయోజనాలకు దోహదం చేస్తాయని చరిత్ర, వాస్తవికత రుజువు చేస్తోంది అని చెప్పారు.

## 75 వేల కిలోల రాకెట్‌ను సిద్ధం చేసిన ఇస్రో

### ఇప్పటిదాకా ఇదే 'పవర్‌ఫుల్'

**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** భారతదేశ అంతరిక్ష లక్ష్యాలకు పెద్ద ముందడుగు వేస్తూ, భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇప్పటివరకు అత్యంత శక్తివంతమైన రాకెట్‌పై పని చేస్తోంది. ఈ రాకెట్ 40 అంతస్తుల ఎత్తు ఉంటుంది. ఇది 75,000 కిలోల బరువు గల ఉపగ్రహాన్ని భూమికి దగ్గరి కక్ష్యలోకి తీసుకెళ్తుంది. ఈ ప్రాజెక్టును ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్ మంగళవారం ఉస్మానియా విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో ప్రకటించారు. 35 కిలోల నుండి 75,000 కిలోలకు ప్రయాణం ఇస్రో ప్రారంభ దశలను గుర్తు చేసుకుంటూ నారాయణన్ డాక్టర్ ఎ.పి.జె. అబ్దుల్ కలాం ఆధ్వర్యంలో రూపొందించిన మొదటి రాకెట్ 17 టన్నుల బరువు ఉంటుందని, అది కేవలం 35 కిలోలను మాత్రమే భూమికి దగ్గరి కక్ష్యలో ఉంచగలదని చెప్పారు. 'ఈ రోజు, మేము 75,000 కిలోలను కక్ష్యలో ఉంచగల రాకెట్‌ను రూపొందిస్తున్నాము. ఈ రాకెట్ 40 అంతస్తుల భవనం ఎత్తు ఉంటుంది' అని ఆయన అన్నారు. ఇది భారతదేశ సాంకేతిక అభివృద్ధిలో ఒక మైలురాయి అని అభివర్ణించారు. 2025లో ఇస్రో కార్యక్రమాలు ఇస్రో చేపట్టనున్న కార్యక్రమాలు నావిక్ ఉపగ్రహాలు భారత స్వతంత్ర జీపీఎస్ వ్యవస్థను మెరుగుపరచడం.కొత్త ఎన్1 రాకెట్, ఇది భారీ ప్రయోగాలకు వెన్నెముకగా పనిచేస్తుందని భావిస్తున్నారు. 6,500 కిలోల అమెరికా కమ్యూనికేషన్ ఉపగ్రహ ప్రయోగం, ఇది భారతదేశ తక్కువ ధర ప్రయోగ వాహనాలపై ప్రపంచ దేశాలకు పెరుగుతున్న నమ్మకాన్ని సూచిస్తుంది.

**టెక్నాలజీ డెమోన్‌స్ట్రేషన్ శాటిలైట్ ప్రయోగం.**

భారత నావికాదళం కోసం ఒక సైనిక కమ్యూనికేషన్ ఉపగ్రహం జీశాట్7ఆర్ ప్రయోగం, ఇది పాతబడిపోయిన జీశాట్7 (రుక్మిణి) స్థానంలో వస్తుంది. భారతదేశ ఉపగ్రహాల సంఖ్యను పెంచడం ప్రస్తుతం, అంతరిక్షంలో భారతదేశానికి 55 ఉపగ్రహాలు పనిచేస్తున్నాయి. అవి నావిగేషన్, కమ్యూనికేషన్, రక్షణ, వాతావరణ శాస్త్రం, భూమి పరిశీలనలకు ఉపయోగపడుతున్నాయి.

ఈ సంఖ్య రాబోయే మూడు నుంచి నాలుగు సంవత్సరాలలో మూడు రెట్లు పెరుగుతుందని నారాయణన్ చెప్పారు. ప్రపంచ పరిస్థితి, ప్రాధాన్యత ఈ ప్రకటన భారతదేశాన్ని అమెరికా, చైనా, రష్యా వంటి అభివృద్ధి చెందిన అంతరిక్ష దేశాల సరసన నిలుపుతుంది. ఈ దేశాలు కూడా భారీ ప్రయోగ వాహనాలను రూపొందిస్తున్నాయి.

## ఇది పరిహాసమా.. ఒక జిల్లా మొత్తాన్ని రాసిస్తున్నారా?

### ఒక కంపెనీకి 992 ఎకరాల భూమిని కేటాయించడంపై గువాహాతి హైకోర్టు సీరియస్!

**గువాహతి, ఆగస్టు 20:** రాష్ట్రంలోని డిమా హసావో జిల్లాలో మహాబల్‌సిమెంట్స్ అనే ప్రైవేట్ సిమెంట్ కంపెనీకి ఏకంగా 3,000 బీఘాల (దాదాపు 992ఎకరాలు) భూమిని కేటాయించడంపై గువాహతి హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వ నిర్ణయాన్ని అసాధారణమైనదిగా అభివర్ణించిన న్యాయస్థానం 'ఇది పరిహాసమా.. ఒక జిల్లా మొత్తాన్ని రాసిస్తున్నారా?' అంటూ సీరియస్‌గా ప్రశ్నించింది.

విచారణ సందర్భంగా జస్టిస్ సంజయ్ కుమార్ మేధి భూ కేటాయింపుల గురించి తెలుసుకుని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఒక ప్రైవేట్ కంపెనీకి 3000 బీఘాలా? అది బీడు భూమి అయినా ఇంత పెద్ద మొత్తంలో కేటాయించడం ఏమిటి? ఇక్కడ కంపెనీకి ఎంత భూమి అవసరం అన్నదికాదు, ప్రజా ప్రయోజ నమే ముఖ్యం' అని వ్యాఖ్యానించారు. ఈ భారీ భూ కేటాయింపుకు సంబంధించిన అన్ని రికార్డులు, ప్రభుత్వ విధాన పత్రాలను తమముందు ఉంచాలని నార్త్ కచార్ హిల్స్ అటానమస్ కౌన్సిల్‌ని న్యాయస్థానం ఆదేశించింది. డిమా హసావో జిల్లా రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్ పరిధిలోకి వస్తుందని, ఇక్కడి గిరిజన తెగల హక్కులు, ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోర్టు గుర్తుచేసింది. కంపెనీ తరఫు న్యాయవాది వాదిస్తూ అది పూర్తిగా బీడు భూమి అని ఫ్యాక్టరీ నిర్మాణానికి అంతభూమి అవసరమని చెప్పారు. టెండర్‌ద్వారా పొందిన మైనింగ్ లీజుకు కొనసాగింపుగానే ఈ కేటాయింపు జరిగిందని తెలిపారు.

## మరో 15 యేళ్లలో చంద్రుడిపైకి భారత్ వ్యోమగామి




### 2027లో మానవసహిత గగన్‌యాన్

### శుభాంశు శుక్లా ఘనతపై లోక్‌సభ చర్చలో కేంద్రమంత్రి జితేంద్రసింగ్

**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** వికసిత భారత్‌కు దూతగా 2040లో భారతీయ వ్యోమగామి చందమామపై అడుగుపెట్టనున్నాడని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. శుభాంశు శుక్లాను అభినందిస్తూ కేంద్రమంత్రి జితేంద్రసింగ్ సోమవారం లోక్‌సభలో చర్చను ప్రారంభించారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ మారేందుకు అంతరిక్ష కార్యక్రమంలో ఈ యాత్ర కీలక పాత్ర పోషిస్తుందని సింగ్ చెప్పారు. 'సంస్కరణల ద్వారా అంతరిక్ష రంగంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని అనుమతించాక సంబంధిత వాణిజ్యం 800 కోట్ల డాలర్లకు చేరింది. వచ్చే దశాబ్ది నాటికి ఇది 4,500 కోట్ల డాలర్లకు చేరుతుంది. వ్యోమమిత్ర అనే రోబోను వచ్చే యేడాది అంతరిక్షంలోకి పంపించనున్నాం. 2027లో తొలిసారిగా మానవసహిత అంతరిక్ష యాత్ర చేపట్టనున్నాం. 2040లో చంద్రుడిపై భారత వ్యోమగామి పాదం మోపి.. త్రివర్ణ పతాకాన్ని ఎగరవేస్తారు. 2035కల్లా మనకూ సొంత అంతరిక్ష కేంద్రం ఉంటుంది' అని జితేంద్ర సింగ్ వివరించారు. బీహార్ ఓటరు జాబితాలో సవరణలను వ్యతిరేకిస్తూ ప్రతిపక్షాలు లోక్‌సభలో నినాదాలు చేశాయి. జితేంద్ర సింగ్ ప్రసంగిస్తున్న సమయంలోనూ ఇవి కొనసాగాయి. వాకౌట్ చేసిన ప్రతిపక్షాల తీరును ఎన్డీయే నేతలు తప్పుబట్టారు. 'మీకు బిజెపిపై, ప్రభుత్వంపై కోపం ఉండవచ్చు. వ్యోమగామిపైనా మీరు కోపంగా ఉండటం ఆశ్చర్యకరం. ఆయనొక వ్యోమగామి మాత్రమే కాకుండా క్రమశిక్షణ గల వాయుసేన సైనికుడు. ఆయనకు ఏ పార్టీతో సంబంధం లేదు' అని జితేంద్ర చెప్పారు.

**ఇలాంటి వాటిపైనా రాజకీయాలా? : రక్షణమంత్రి రాజ్‌నాథ్**

దేశం అభివృద్ధి చెందడం ప్రతిపక్షాలకు ఇష్టంలేదని, వాటి తీరు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ విమర్శించారు. దేశానికి గర్వకారణమైన అంశాల్లోనైనా రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రశ్నోత్తరాల సమయానికి అడ్డుపడిన సభ్యులపై స్పీకర్ ఓంబిర్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నేతలు ప్రశ్నలడిగితే ప్రజలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. విపక్ష నిరసనలతో సభ వాయిదా పడినందువల్ల అసంపూర్తిగా మిగిలిన చర్చ మంగళవారం కొనసాగింది. ప్రతిపక్షాల ఆందోళనతో రాజ్యసభ కూడా వాయిదా పడింది. గందరగోళం మధ్యనే భారతీయ ఓడరేవుల బిల్లును సభ ఆమోదించింది. విపక్షాలు బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తూ అరాచకంగా వ్యవహరిస్తున్నాయని సభాపక్ష నేత జెపి నడ్డా విమర్శించారు.

## సంక్షిప్తంగా..

### నెహ్రూ దేశాన్ని రెండుసార్లు విభజించారు: ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ భారతదేశాన్ని రెండుసార్లు విభజించారని ప్రధాని నరేంద్రమోడీ ఆరోపించారు. ఒకసారి రాడ్‌క్లిఫ్ లైన్‌తో విభజిస్తే భారత్‌కు చెందిన సింధూ నదిని ముక్కలు చేసి మరోసారి విభజించారన్నారు. దీనివల్ల దేశంలో వ్యవసాయానికి గణనీయమైన నష్టం వాటిల్లిందన్నారు. కొంత కాలానికి పాకిస్తాన్‌తో తాను చేసుకున్న సింధూ నది ఒప్పందం వల్ల 80 శాతం నీరు ఆ దేశానికి వెళ్లాయని భారత్‌కు మాత్రం ఎలాంటి ప్రయోజనం లేదనే విషయాన్ని నెహ్రూనే స్వయంగా అంగీకరించారన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతులకు వ్యతిరేకి అనే దానికి ఆయన తీసుకున్న నిర్ణయాలే నిదర్శనమన్నారు. రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్యపు హక్కును కాలరాసేందుకు నెహ్రూ హయాంలో రాజ్యాంగ సవరణ చేశారని మోడీ మండిపడ్డారు. ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా నియోజకవర్గాల సంఖ్యను పెంచేశారని ఆరోపించారు. వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ కృషి చేయలేదని, తమ ప్రభుత్వం అధికారం చేపట్టాకే వారి అభివృద్ధి మొదలయిందని, ఎన్డీఎ పాలనలో దేశం మూడో ఆర్థిక శక్తిగా ఎదిగే దిశగా అడుగులు వేస్తోందన్నారు.

### హద్దుమీరితే అరెస్టులే: అసోం సిఎం శర్మ

**గౌహతి, ఆగస్టు 20:** ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు తమ రాష్ట్రంలో పర్యటించడంపై అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 'కొత్త వ్యక్తులు' రాష్ట్రాన్ని సందర్శిస్తున్నారని, సున్నిత అంశాలపై రాజకీయం చేస్తే అరెస్టు చేస్తామని హెచ్చరించారు. కేరళ, ముంబయి, ఢిల్లీ ఇలా ఎక్కడివారైనా నిబంధనలకు లోబడి నడుచుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పర్యటించే కొందరిపై నిఘా ఉంచాం. ఎన్ఆర్‌సి అప్‌డేషన్ సమయంలోనూ కొందరు అలజడులు సృష్టించడానికి ప్రయత్నించారు. అప్పుడు వారిపై ప్రభుత్వం అంతగా దృష్టి పెట్టలేదు. కానీ ఇప్పుడు మాత్రం వారిపై కన్నేసి ఉంచాం. నిబంధనలు అతిక్రమించి హద్దులు దాటి ప్రవర్తిస్తే అరెస్టు చేస్తాం అని సిఎం హిమంత పేర్కొన్నారు. రాష్ట్రంలోని సున్నితమైన అంశాలపై రాజకీయం చేస్తే సహించే ప్రసక్తే లేదని అస్సాం ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కేరళ, ముంబయి లేదా ఢిల్లీ ఎక్కడి నుంచి వచ్చినా కొన్ని వర్గాల వారి కార్యకలాపాలను ప్రోత్సహించే ప్రయత్నాలను ఉపేక్షించమన్నారు.

### రాధాకృష్ణన్ నామినేషన్

**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి సిపి రాధాకృష్ణన్ ఈనెల 20వ తేదీ ఉదయం 11 గంటలకు నామినేషన్ దాఖలు చేయనున్నారు. రాధాకృష్ణన్ నామినేషన్ పేపర్లపై ఎన్డీఎ పక్ష నేతలు సంతకాలు చేయనున్నారు. ఆయనకుమద్దతుగా 20 సెట్ల నామినేషన్ పత్రాలు సమర్పించనున్నారు. ఎన్నిక సందర్భంగా అనుసరించాల్సిన వ్యూహంపై మంగళవారం ఉదయం ఎన్డీయే పక్ష నేతలు సమావేశం కాగా, సాయంత్రం 4.30 గంటలకు మరోసారి సమావేశమయ్యారు.

**ప్రతిపక్షాల మద్దతు కోరిన మోడీ**

కాగా, ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కు ప్రతిపక్షాలు మద్దతివ్వాలని ప్రధానమంత్రి మోదీ కోరారు. ఏకగ్రీవంగా ఆయననుఎన్నుకునేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పార్లమెంటులోని బాలయోగి ఆడిటోరియం మంగళవారం ఉదయం ఎన్డీయే ఎంపీల సమావేశం జరిగింది. ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌ను ప్రధాని స్వయంగా ఎంపీలకు పరిచయం చేశారు. అనంతరం రాధాకృష్ణన్‌ను సన్మానించారు. కాగా, 20వ తేదీ ఉదయం 11 గంటలకు సీపీ రాధాకృష్ణన్ నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తారని కిరణ్ రిజిజు చెప్పారు.

### అమెరికాలో మెలోనీ వీడియో వైరల్..

**వాషింగ్టన్, ఆగస్టు 20:** భారత ప్రధాని నరేంద్రమోడీ, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీల పేర్లు మరోసారి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. వీరిమధ్య ఎలాంటి భేటీ జరగలేదు. అయితే, అమెరికాలోని వైట్‌హౌస్‌లో సమావేశంకోసం వచ్చినఆమె.. అక్కడిఅధికారులను భారతీయ సంప్రదాయంలో నమస్తే అంటూ పలకరించారు. దీనికి సంబంధించిన దృశ్యాలు నెట్టింట వైరల్‌గా మారగా.. మోడీ ఎఫెక్ట్ అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. రష్యాతో యుద్ధం ముగించే అంశంపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో భేటీఅయిన సంగతి తెలిసిందే. ఈ సమావేశానికి యూరోపియన్ నేతలు కూడా హాజరయ్యారు. అందులో ఇటలీ ప్రధాని మెలోనీకూడా ఉన్నారు. వైట్‌హౌస్‌కుచేరుకున్న ఆమెకు ట్రంప్ పరిపాలనాధికారులు స్వాగతం పలికారు. ముందుగా షేక్‌హ్యాండ్స్‌తో వారినిపలకరించిన మెలోనీ.. అనంతరం నమస్కారం చేశారు. దీనికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి.

## ఆక్రమణల తొలగింపులో రాజీ లేదు : గుంటూరు కమిషనర్



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం ఆయన ఉద్యోగనగర్, విజయపురి కాలనీ, విద్యానగర్, నవభారత్‌నగర్‌లలో జరుగుతున్న పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. అలాగే పొన్నూరు రోడ్డులో రోడ్డు, డ్రెయిన్ ఆక్రమణల తొలగింపు పనులను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు.
ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డ్ వారీగా చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పార్కుల్లో పచ్చదనం పెంపుతో పాటు వాకింగ్ ట్రాక్‌ల్లో నీరు నిల్వకుండా ముందస్తు డ్రైనేజీ ఏర్పాటు చేయాలని సూచించారు. పొన్నూరు రోడ్డులో ఆక్రమణలపై ఇప్పటికే పలు మార్లు నోటీసులు ఇచ్చినా కొందరు సహకరించడం లేదని, ఆక్రమణల తొలగింపులో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ ఉండదని కమిషనర్ హెచ్చరించారు. స్వచ్ఛందంగా తొలగించుకోకపోతే జరిగే నష్టానికి ఆక్రమణదారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.
ఈ పర్యటనలో సిటీ ప్లానర్ రాంబాబు, డి.ఇ.ఇ. శ్రీనివాస్‌తో పాటు పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య శాఖ అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



- పెదవడ్లపూడి గ్రామంలో ముగ్గురికి 1,99,490/- సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ
- బాధితుల ఇంటికి వెళ్లి చెక్కులు పంపిణీ చేసిన టిడిపి నాయకులు

మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను సోమవారం టిడిపి నాయకులు బాధితుల ఇంటికి వెళ్లి అందజేశారు. మంగళగిరి మండలం పెద్దవడ్లపూడి గ్రామంలో లామ్ ప్రసాద్ కి రూ 1,01,208 వేల చెక్కును, మోర్ల విజయలక్ష్మి కి రూ 46,150 విలువైన చెక్కును, గోనుగుంట్ల శ్రీహరి రావు (లేటు) 52,132/- వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను, మొత్తం ముగ్గురికి 1,99,490/- రూ విలువైన చెక్కులను మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ చేతుల మీద గా అందజేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి చెక్కులు రావడానికి కృషిచేసిన మంత్రి నారా లోకేష్ కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమం లో గ్రామ పార్టీ అధ్యక్షులు యేళ్ళ శివరామయ్య, మాదల రమేష్ బాబు, చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు, చింతల ఏడుకొండలు, జాలాది సందీప్, మొద్దుకురి రమేష్,కంచర్ల బద్రి, శానం రఘు, గుడిమెట్ల ఎల్లయ్య, కోట అరుణ్ దత్ తదితరులు పాల్గొన్నారు.

## కాపు జన హితైషుడు దాసరి రాము



- రాము కుమార్తె అకాల మరణం సంతాప సభకు పెద్ద ఎత్తున తరలివచ్చిన అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ఆత్మీయులు, బంధుగణం

గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): దశాబ్దాలుగా కాపు, ఒంటరి, బలిజ, నాయుడు కులాల మధ్య ఐక్యతకు రెండు తెలుగు రాష్ట్రాల తో పాటు తమిళనాడు, ఒరిస్సా, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, దుబాయ్, సింగపూర్, మలేషియా, యూరప్ దేశాలలో కూడా పర్యటించి విశేషంగా కృషి చేస్తున్న దాసరి రాము కుటుంబంలో ఏకైక కుమార్తె శేష సాయి ప్రియాంక అకాల మరణం తీవ్ర విషాదాన్ని పంచిందని, చదువుకుంటూ తండ్రితో పాటు తనుగా రాజకీయ, సేవా కార్యక్రమాలలో పాలుపంచుకున్న హారిక కు సద్గతులు ప్రాప్తించాలని తెలుగుదేశం పార్టీ, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ, జనసేన, భారతీయ జనతా పార్టీ నాయకులు దాసరి రాము గీత దంపతులకు, కుమారుడు పవన్ కు తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ప్రముఖ కాపు ఐక్యత, సంఘటనా నాయకుడు నాయకుడు దాసరి రాము ఏకైక కుమార్తె శేష సాయి ప్రియాంక అనారోగ్యంతో అకాల మరణం చెందిన సందర్భంగా స్థానిక రింగ్ రోడ్డు సిద్ధార్థ కన్వెన్షన్ సమావేశ మందిరంలో సంస్మరణ సభ నిర్వహించారు. మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, మాజీ పార్లమెంట్ సభ్యులు మోదుగుల వేణుగోపాల రెడ్డి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు, మాజీ శాసనసభ్యులు లింగంశెట్టి ఈశ్వరరావు, షేక్ మస్తాన్ వలి, కిలారి రోశయ్య, దేగల ప్రభాకరరావు, తులసి ధర్మ చరణ్, యోగేష్, చందు సాంబశివరావు, రిటైర్డ్ ఎస్పి సిహెచ్ చక్రపాణి, హారిక స్నేహితులు వందలాదిమంది కాపు నాయకులు, బంధుమిత్రులు దాసరి రాము దంపతులను పరామర్శించారు.

## ప్రతి శానిటరీ ఇన్స్పెక్టర్ బాధ్యతగా పనిచేయాలి

- గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిశుభ్రతపై ఎమ్మెల్యే మాధవి దృష్టి



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):గుంటూరు నగరం పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉండేందుకు ప్రతి శానిటరీ ఇన్స్పెక్టర్ తమ పరిధిలో పూర్తి బాధ్యతతో పనిచేయాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి సూచించారు.
బుధవారం గుంటూరు పశ్చిమ పరిధిలోని శానిటరీ ఇన్స్పెక్టర్లతో సమావేశమై ఎమ్మెల్యే వారికి పలు సూచనలు చేశారు. రోజువారీ చెత్త డోర్ టు డోర్ కలెక్షన్ తప్పనిసరిగా నిర్వహించాలి, ప్రధాన రహదారులు, కాలనీలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆదేశించారు. వర్షాకాలం దృష్ట్యా డ్రైనేజీలు, కాలువలు క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. విద్యా సంస్థలు, ప్రార్థనా మందిరాలు చుట్టు ప్రక్కల డంపింగ్ పాయింట్స్ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. అదే విధంగా ప్రతి ఇన్స్పెక్టర్ తన పరిధిలోని శానిటేషన్ సిబ్బందిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని, క్రమం తప్పకుండా తనిఖీలు చేసి లోపాలు ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలని చెప్పారు. చెత్త వర్గీకరణ (డ్రై & వెట్ వేస్ట్) పై అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే, మురుగు కాల్వలలో తాగునీటి పైప్‌లైన్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి, కాలేజీలు, ప్రార్థన స్థలాల వద్ద ఎప్పటికప్పుడు చెత్తను శుభ్రం చేయాలని, పీకల వాగులో ఎలాంటి అడ్డంకులు లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ముఖ్యంగా ప్రధాన కాలువల్లో ప్లాస్టిక్ అడ్డంకులు లేకుండా మెష్ ఏర్పాటు చేయాలి అని ఆమె స్పష్టం చేశారు. "గుంటూరు పరిశుభ్రతలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకమన్నారు.
సమావేశం ముగిసిన అనంతరం తమ పరిధిలో బాగా పనిచేసిన శానిటరీ ఇన్స్పెక్టర్లను ఎమ్మెల్యే సన్మానించారు.

## మలేరియా అంతం మనందరి పంతం : కమిషనర్



తెనాలి (జర్నలిస్ట్ ఫైల్): ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా తెనాలిలో మలేరియా నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. బుధవారం కొత్తపేట పాత ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలోని మలేరియా సబ్‌యూనిట్ కార్యాలయం నుండి మునిసిపల్ కమిషనర్ వల్లూరు మహాలక్ష్మీపతిరావు పచ్చజెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. చినరావూరులోని డాక్టర్ పాల్‌రాజ్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థినులు దోమల నిర్మూలన నినాదాలతో ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మలేరియా వ్యాధి దోమల ద్వారా వ్యాప్తి చెందుతుందని, నీటి నిల్వలు ప్రధాన కారణమని తెలిపారు. 2027 నాటికి మలేరియా కేసులను జీరోకి, 2030 నాటికి దేశాన్ని మలేరియా రహితం చేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు.
మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మొవ్వ ఏసుబాబు మాట్లాడుతూ 1897 ఆగస్టు 20న సికింద్రాబాద్‌లో సర్ రోనాల్డ్ రాస్ మలేరియా వ్యాధి దోమల ద్వారా వ్యాప్తి చెందుతుందని నిరూపించారని, అందుకే ఆ తేదీని ప్రపంచ దోమల దినోత్సవంగా జరుపుతున్నామని చెప్పారు. సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి వారానికి ఒకసారి నీటి నిల్వలు తొలగించడం ద్వారా దోమల ఉత్పత్తి తగ్గుతుందని, ప్రజలంతా "ఫ్రైడే – డ్రైడే"గా పాటించాలని సూచించారు. అనంతరం గాంధీచౌక్‌లో మానవహారం నిర్వహించి మలేరియా నిర్మూలనకు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, మలేరియా – ఫైలేరియా సిబ్బంది, ఆశా కార్యకర్తలు, పురపాలక సంఘ నగర దీపికలు పాల్గొన్నారు.

## పూడిపోయిన మురుగు నీటికాలువ ప్రక్షాళన చేసి.. రైతు అవసరం తీరుస్తాం



తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్) గుడివాడ ఎరుకలపూడి అగ్రహారం రైతులకు వరి సాగులో మురుగునీటి పారుదల సమస్య పరిష్కరించేందుకు తప్పనిసరిగా తగు చర్యలు తీసు కుంటామని మండల తహశీల్దార్ కే వి గోపాలకృష్ణ పంట పొలాల క్షేత్రస్థాయి పరిశీలనలో రైతులకు హామీ ఇచ్చారు. మండలంలోని గుడివాడ ఎరుకలపూడి అగ్రహారం రైతులకు సంబంధించి, 200 ఎకరాల వరి సాగు ముంపుకు గురైన క్రమంలో, గడచిన సోమవారం గ్రీవెన్స్ ద్వారా రైతులు సమస్యను మండల తహశీల్దార్ దృష్టికి తీసుకువెళ్లగా, బుధవారం తహశీల్దార్ కె వి గోపాలకృష్ణ ముంపుకు గురైన పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములక శివ సాంబి రెడ్డి, తదితర రైతులు వాస్తవ పరిస్థితులను తహశీల్దార్ కె వి గోపాలకృష్ణకు వివరించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ కె వి గోపాలకృష్ణ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, విజయవాడ ఒంగోలు రైలు ప్రయాణానికి మూడవ ట్రాక్ వేయడం వల్ల, మురుగునీటి కాలువ పూర్తిగా మూసుకు పోయిన విషయాన్ని గుర్తించమన్నారు. రైతులు సంయమనం పాటించాలని, రెవిన్యూ సర్వేయర్ ద్వారా గురువారం కొలతలు వేయించడం జరుగుతుందని, రైల్వే అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి త్వరితగతిన సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములక శివ సాంబి రెడ్డి మాట్లాడుతూ రైతాంగం సమిష్టిగా ఉండటం ద్వారా, ఎటువంటి సమస్యకైనా పరిష్కారం లభిస్తుందని అన్నారు. రైతాంగం సమస్యను అర్థం చేసుకొని, పరిష్కరించేందుకు ముందుకు వచ్చిన తహశీల్దార్ గోపాలకృష్ణకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు ఎన్ సుబ్రహ్మణ్యం, కంచర్ల రవి, తిరుమల వెంకయ్య, శివరామకృష్ణ, తురగా వెంకట్రావు, బండి సుధాకర్, వీఆర్వో ఏ భాను కిరణ్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థులను విద్యకు దూరం చేస్తున్న ప్రభుత్వం



మైదుకూరు (జర్నలిస్ట్ ఫైల్) పట్టణంలోని స్థానిక అదేవిధంగా రాష్ట్రంలో ఉన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని మైదుకూరు మండల తాసిల్దార్ రాజసింహ కు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేయడం జరిగింది ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎద్దురాహుల్ మాట్లాడుతూ మైదుకూరు నియోజకవర్గం నాలుగు మండలాల నుంచి దాదాపు వందల మంది విద్యార్థులు మైదుకూరు పట్టణంకి చదువు అభ్యసించడానికి వస్తున్నారు కానీ ఇంతవరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవటం దారుణం కావున జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ప్రభుత్వ హై స్కూల్ నందు సరైన నీటి మౌలిక వసతి లేదు కావున పాఠశాలకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని అలాగే ఉర్దూ జూనియర్ కళాశాలలో రెగ్యులర్ ప్రిన్సిపాల్ ను ఏర్పాటు చేయాలని అలాగే రాష్ట్రంలో ఉన్న విద్యార్థులు విద్యార్థులకు కోసం పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ 6400 కోట్లు విడుదల చేయాలని జీవో నెంబర్ 77 ను రద్దు చేయాలని పీజీ విద్యార్థులందరికీ ఫీజు రీయింబర్స్మెంట్ అందించాలని హాస్టల్స్ విద్యార్థులకు నెలకు 3 వేలకు మెస్ బిల్లులు పెంచాలని జిల్లాలో హాస్టల్ కు సొంత భవనాలు నిర్మించాలని ఎయిడెడ్ జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ పుస్తకాలు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని అర్హులైన వారికి తల్లికి వందనం 15000 ఎటువంటి షరతులు లేకుండా ఇవ్వాలని రాష్ట్రంలో ఉన్న విద్యార్థులందరికీ ఉచిత బస్సు పాస్ ఇవ్వాలని మైదుకూరు పట్టణ రాష్ట్రంలో ఉన్న విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం అదేవిధంగా స్థానికంగా ఉన్న సమస్యలను వెంటనే జిల్లా అధికారులు పరిష్కరించాలని విద్యార్థులకు విద్యను అందించే విధంగా చూడాలని, భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ గా కోరుతున్నాం లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్న, ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రాజశేఖర్ విద్యార్థులు సుధీర్ తేజ పాల్గొన్నారు.

## శ్రీవారాహి అమ్మవారి విగ్రహప్రతిష్టా మహోత్సవాలు



తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్) ఆధ్యాత్మిక చింతనలో అమ్మ అనుగ్రహం లభిస్తే అన్నిలభించినట్లేనని పెనుగొండ శ్రీవాసవీమాతపీఠాధిపతులు శ్రీప్రజ్ఞానందసరస్వతి స్వామి శ్రీవారాహీ అమ్మవారి విగ్రహ ప్రతిష్టలొ పాల్గొన్న, భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణ చేశారు. కొల్లిపర మండలం కుంచవరం గ్రామంలోని పోస్ట్ స్వచ్ఛంద సంస్థ ప్రాంగణంలో,గత నాలుగు రోజులుగా విశేషమైన, యజ్ఞ క్రతువులతో శ్రీ వారాహి అమ్మవారికి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ఘనంగా కొనసాగాయి. బుధవారం నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంతో శ్రీ వారాహి అమ్మ వారి విగ్రహ ప్రతిష్ట యజ్ఞక్రతువు ప్రాధాన్యతను సంతరించుకుంది. పోస్ట్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు తన్నీరు శ్రీనివాస్ బాబు దంపతులు యజ్ఞ క్రతువులొ పాల్గొనగా,పెనుగొండ శ్రీ వాసవి పీఠం పీఠాధిపతులు శ్రీ ప్రజ్ఞానంద సరస్వతీ స్వామి ఆత్మీయ అతిథిగా పాల్గొని, ఆలయ ప్రాంగణంలోని కళ్యాణమండపాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి స్వామీజీ అనుగ్రహ భాషణ చేశారు. శ్రీ వారాహి మాత అనుగ్రహం ఉంటే అన్నీ ఉన్నట్లేనని, మహిమాన్వితమైన అమ్మ సేవకు భక్తులు పాత్రులు కావాలన్నారు. శరణాగతి గోష్టి నిర్వాహకులు శ్రీ నరేంద్ర రామానుజ స్వామి, శ్రీ మహా విద్యానంద గిరి మాతాజీ సంత సదానంద, ఈ విశేష ఆధ్యాత్మిక సేవలో పాల్గొని భక్తులకు తమ ఆశీర్వచనాలు అందజేశారు. వేలాదిగా తరలివచ్చిన భక్తజన సందోహం నడుమ, ధ్వజస్తంభ ప్రతిష్ట, మూలవిరాట్ ప్రతిష్ట, శిఖర ప్రతిష్ట పూజలను, పూర్ణాహుతి క్రతువును,ప్రతిష్టాపనచార్య మామిళ్ళపల్లి మృత్యుంజయ శాస్త్రి పర్యవేక్షించారు. మహిళా భక్తులకు పసుపు, కుంకుమలు, పంపిణీ చేశారు. పట్టణ ప్రముఖులు కాకతీయ కోపరేటివ్ సొసైటీ చైర్మన్ డిఎల్ కాంతారావు, మాజీ ఎఎస్పీ తిరుపతి విఠలేశ్వర్, వెంకటేశ్వర యోగా సేవ కేంద్రం కన్వీనర్ ఎం రమణయ్య, కార్యక్రమాలకు సహకరించగా, వేలాదిగా తరలివచ్చిన భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

## ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఇ.యు డిమాండ్



అమరావతి,(జర్నలిస్ట్ ఫైల్):ఆర్టీసీ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ పిటిడి (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ (ఇ.యు) రాష్ట్ర కమిటీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ (ఐఏఎస్)కు లేఖ ఇచ్చింది. బుధవారం సచివాలయంలో జరిగిన ప్రభుత్వ ఉద్యోగ సంఘాల జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఈ లేఖను సమర్పించినట్లు ఇ.యు రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వీ. నరసయ్య ఒక ప్రకటనలో తెలిపారు.
గత ఆరు సంవత్సరాలుగా ప్రభుత్వ అనుమతుల కోసం వేచి ఉన్న ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులు ఇంకా నిలిచిపోయాయని, ఈ వ్యవధిలో సుమారు రెండు వేల మంది పదోన్నతి పొందకుండానే రిటైర్ అయ్యారని పేర్కొన్నారు. ప్రస్తుతానికి ప్రభుత్వ గ్రీన్ సిగ్నల్ వస్తే అధికారుల నుండి క్లాస్–4 వరకు దాదాపు 3 వేల మందికి పదోన్నతులు లభిస్తాయని వివరించారు. అదనంగా పిటిడి కమిషనర్ సి. హెచ్. ద్వారకాతిరుమలరావు ఇప్పటికే పంపిన మరో 12 ఫైల్స్ కూడా ప్రభుత్వ అనుమతుల కోసం పెండింగ్‌లో ఉన్నాయని, వీటికి తక్షణ ఆమోదం ఇవ్వాలని కోరారు.
ఆర్టీసీలో ఖాళీల సమస్యను కూడా ఇ.యు ప్రస్తావించింది. కండక్టర్లు, డ్రైవర్లు, మెకానికల్ సిబ్బంది తదితర విభాగాల్లో ఉన్న 10 వేల ఖాళీలను వెంటనే భర్తీ చేసేందుకు ప్రభుత్వ ఆమోదం ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. అలాగే 11వ పిఆర్‌సీ ప్రకారం పెండింగ్‌లో ఉన్న 24 నెలల అరియర్స్, డీఏ బకాయిలు, కొత్త డీఏలను చెల్లించాలని డిమాండ్ చేసింది.
వైద్య సౌకర్యాల విషయంలో విలీనానికి ముందు అమలులో ఉన్న విధానాన్ని పునరుద్ధరించాలని, ఈహెచ్ఎస్ ద్వారా క్యాష్‌లెస్ చికిత్స సదుపాయం కల్పించాలన్నారు. ప్రభుత్వ గుర్తింపు సంఘాల పరంగా పిటిడి కమిషనర్ సిఫారసు చేసిన ఇ.యు, నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్‌లకు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్, ఈహెచ్ఎస్ మేనేజింగ్ కమిటీల్లో ప్రతినిధులుగా అవకాశం కల్పించాలని కూడా డిమాండ్ చేశారు.
ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంబంధించిన కమిషనర్ చేసిన సిఫారసులన్నింటికీ ప్రభుత్వం వెంటనే అనుమతి ఇవ్వాలని లేఖ ద్వారా సి.యస్‌ను కోరినట్లు పలిశెట్టి దామోదరరావు స్పష్టం చేశారు.

## మాజీప్రధాని రాజీవ్ గాంధీకి నివాళులు



తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్) : క్రియాశీలకమైన జీవన విధానంతో రాజకీయాలలొ కాంగ్రెస్ పార్టీ ద్వారా దేశ ప్రధానిగా స్వర్గీయ రాజీవ్ గాంధీ ఎన్నో విలువైన సేవలు అందించారని ఆయన జయంతి వేళ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 81 వ జయంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ చందు సాంబశివుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొలుత రాజీవ్ గాంధీ చిత్రపటం చెంత పువ్వు లుంచి ఘనంగా నివాళి అర్పించారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా దేశానికి రాజీవ్ గాంధీ అందించిన సేవలను నాయకులు స్మరించుకున్నారు. తండ్రికి తగ్గ వారసుడిగా నేడు రాహుల్ గాంధీ పార్టీ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొన్నూరు నాగ సూర్య శశిధర్, మండల పార్టీ అధ్యక్షుడు మల్లవరపు ప్రసాద్, మీడియా కోఆర్డినేటర్ మాదాల పూర్ణచంద్రరావు, భీమ రమేష్, చందు అయ్యప్ప, కోటేశ్వరరావు, స్టీవెన్ బాబు, అనిల్, వీరస్వామి, సురేష్, నాగూర్ ,కార్తీక్ శ్రీనివాస్ రావు, వెంకటేష్, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ అభివృద్ధిలో ... అన్ని వార్డులకు తగు ప్రాధాన్యం



- 35వ, వార్డులో అభివృద్ధి పనులు ప్రారంభించిన చైర్ పర్సన్ తాడిబోయినరాధిక

తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్) : పట్టణ అభివృద్ధిలో భాగంగా ప్రతి వార్డులోను ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులకు తగు ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధికపేర్కొన్నారు.
స్థానికగంగానమ్మపేటలోని 35 వ వార్డు పరిధిలో బుధవారం, అక్కల వారి వీధి, సిసి రోడ్డు నిర్మాణ పనులకు, సైడ్ కాలువల నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్ పర్సన్ తాడి బోయిన రాధిక ముఖ్యఅతిథిగా పాల్గొని, భూమి పూజ చేసి,అభివృద్ధి పనులను ప్రారంభించారు. జనరల్ ఫండ్స్,12 లక్షల రూపాయలతో 150 మీటర్ల మేర, సిసిరోడ్, డ్రైయిన్స్ నిర్మాణ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఈ సందర్భంగా చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక మీడియాకు వివరించారు. కార్యక్రమంలో 35 వ వార్డు కౌన్సిలర్ గొడవర్తి సాయి హరే రామ్, డిఇ శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఇంజనీర్ ఆంజనేయరాజు ఆ ప్రాంత ప్రజలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రేపల్లెలో విద్యుత్ విజిలెన్స్ దాడులు రూ.3.63 లక్షల జరిమానా



రేపల్లె (జర్నలిస్ట్ ఫైల్): రేపల్లె టౌన్ సెక్షన్‌లో విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం విస్తృత తనిఖీలు చేపట్టింది. బుధవారం జరిగిన ఈ దాడుల్లో అరవై రెండు బృందాలు పాల్గొని ఆరు వేల తొంభై తొమ్మిది సర్వీసులు పరిశీలించాయి. అనుమతించిన కేటగిరీకి విరుద్ధంగా విద్యుత్ వినియోగం చేసిన ముగ్గురిపై ముప్పై వేల రూపాయలు, అదనపు లోడుతో విద్యుత్ వాడిన యాభై మందిపై మూడు లక్షల ముప్పై మూడు వేల రూపాయల అపరాధ రుసుము విధించారు. మొత్తంగా మూడు లక్షల అరవై మూడు వేల రూపాయలు వసూలు చేసినట్లు విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చె. వెంకటేశ్వరరావు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.వి. చిరంజీవి సంయుక్త ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మీటర్లపై సీలు తప్పనిసరిగా ఉండాలని, అవి లేకపోతే లేదా దెబ్బతిన్నా వెంటనే సంబంధిత సిబ్బందికి రాతపూర్వకంగా తెలియజేయాలని విజిలెన్స్ అధికారులు సూచించారు. సీలు లేకపోవడం, గాట్లు పెట్టడం, వేరే మీటర్లు అమర్చడం విద్యుత్ దొంగతనంగానే పరిగణిస్తామని స్పష్టం చేశారు. భారత విద్యుత్ చట్టం నూట ముప్పై ఐదవ సెక్షన్ ప్రకారం మొదటి తప్పిదానికి కాంపౌండింగ్ పద్ధతిలో రుసుము వసూలు చేసి విడిపిస్తారు. రెండవసారి అయితే నేరుగా అరెస్టు చేసి రిమాండ్‌కి పంపుతారని, అపరాధ రుసుము చెల్లించని పక్షంలో రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం ఆస్తులు జప్తు చేస్తారని అధికారులు హెచ్చరించారు. విద్యుత్ చౌర్యంపై ఫిర్యాదులను తొమ్మిది నాలుగు నాలుగు సున్నా ఎనిమిది ఒక రెండు రెండు ఆరు మూడు, తొమ్మిది నాలుగు నాలుగు సున్నా ఎనిమిది ఒక రెండు మూడు ఆరు సున్నా, తొమ్మిది నాలుగు నాలుగు సున్నా ఎనిమిది ఒక రెండు మూడు ఆరు ఒక నెంబర్లకు అందించవచ్చని తెలిపారు. విద్యుత్ చౌర్యంపై ఫిర్యాదులను 9440812263, 9440812360, 9440812361 నెంబర్లకు నేరుగా లేదా వాట్సాప్ ద్వారా అందించవచ్చని, ఫిర్యాదు దారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. ఈ తనిఖీల్లో డి.ఇ.ఇ.లు కె. రవికుమార్, ఎన్. మల్లిఖార్జున ప్రసాద్, ఎస్. శ్రీనివాసరావు, డి. శ్యాం సుధాకర్ బాబు, ఏ.ఇ.లు కె. కోటేశ్వరరావు, ఎం. సతీష్‌కుమార్, టి.ఇ. శివశంకర్, ఆపరేషన్ ఏ.ఇ. వి. రాఘవేంద్ర, ఆపరేషన్ డి.ఇ.ఇ.లు, ఏ.ఇ.ఇ.లు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

